

చిట్వేలి వద్ద ఓటుహక్కు కోసం ఓ అవ్వను వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న యువకుడు

# వైసీపీ అరాచకం

- దీటుగా ఎదుర్కొన్న కూటమి నాయకులు
- పలుచోట్ల వలంటీర్లను తరిమికొట్టిన ప్రజలు
- చెదురుమదురు సంఘటనలు మినహా.. జిల్లా ప్రశాంతం
- వెల్లివిరిసిన ఓటరు చైతన్యం
- తెల్లవారక ముందే పోలింగ్ కేంద్రాల ముందు క్యూ
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- కొన్నిచోట్ల ఆరు దాటినా కొనసాగిన పోలింగ్



మదనపల్లెలోని పెంచుపాడు రోడ్డులోని రవీంద్రనాథ్ స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వివాదం, చెదరగొడుతున్న పోలీసులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాలలో అధికార వైసీపీ నాయకులు అనేక అక్రమాలు, అరాచకాలకు ప్రయత్నించారు. టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన ఏజెంట్లను కిడ్నాప్ చేశారు. నాయకులపై రాళ్లు, కట్టెలతో దాడులకు దిగారు. ఈ దాడిలో జనసేనకు చెందిన ఒక పోలింగ్ ఏజెంట్ తన కన్నును కోల్పోయారు. మరొక టీడీపీ నాయకుడిపై ఇనుప రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండలంలో టీడీపీ కార్యకర్త వెంకటరమణపైన వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం అనంతసముద్రం పంచాయతీ పాపక్కగారిపల్లెలో జనసేన ఏజెంట్లను తీసుకెళ్తున్న టీడీపీ నాయకుడు ముద్దా సుభాష్‌రెడ్డిపై వైసీపీ నాయకులు ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఇదే పోలింగ్ కేంద్రంలో జనసేన పార్టీ పోలింగ్ ఏజెంట్ మణిపై వైసీపీ నాయకులు దాడి చేయడంతో ఆయన తన కన్నుకోల్పోయాడు. ఇదే మండలం దళవాయిపల్లె పోలింగ్ బూత్‌లో జనసేన ఏజెంట్ రాజారెడ్డిపైన వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈ సంఘటనపై పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, జనసేన నాయకులు రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. పుల్లంపేట మండలం జాగువారిపల్లెలో టీడీపీ ఏజెంట్లను పోలింగ్ బూత్‌లోకి వైసీపీ నాయకులు అనుమతించలేదు. గుర్రంకొండ మండలం మామిళ్లపల్లెలో వైసీపీ, టీడీపీ వర్గాలు ఘర్షణపడ్డాయి. రాజంపేట నియోజకవర్గం సుండుపల్లె మండలం కొండలతూర్పులో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓట్లు పడుతున్నాయనే భావనతో వైసీపీ నాయకులు గొడవ చేశారు. రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లె మండలం చౌటపల్లె గ్రామంలో టీడీపీ, వైసీపీ నాయకులు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకున్నారు. టీడీపీ వర్గీయుల బైకులను వైసీపీ నాయకులు ధ్వంసం చేశారు. ఏఎస్పీ హైమావతి, డీఎస్పీ శ్రీధర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. వాల్మీకీపురంలో టీడీపీ నాయకుడు శంకర్‌పై వైసీపీ ఉపసర్పంచ్ కేశవరెడ్డి దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నమండెం మండలం శ్రీనివాసపురంలో టీడీపీకి ఓట్లు పడుతున్నాయనే ఆక్రోశంతో వైసీపీ నాయకులు టీడీపీ సానుభూతిపరులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. రాయచోటి మండలం నక్కవాళ్లపల్లె పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ వర్గీయులు పరస్పరం రాళ్ల దాడులకు దిగారు. ఈ ఘటనలో వైసీపీ వర్గీయులకు రక్తగాయాలయ్యాయి.

మదనపల్లెలో సోమవారం జరిగిన పోలింగ్ సందర్భంగా వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య అక్కడక్కడ వివాదాలు చోటు చేసుకున్నాయి. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ ఓట్లు అడుగుతున్నారనే అంశంపై ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు చేసుకున్నాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి చివరకు ఘర్షణకు, తోపులాటకు దారితీసింది. అనంతరం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇదే విషయమై మరో సారి వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఒకరిపై దాడులు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను బలగాలతో చెదరగొట్టారు. అయితే అధికార పార్టీ అరాచకాలకు కూటమి కూడా దీటుగానే ఎదుర్కొంది. అధికార పార్టీ అక్రమాలకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేశారు. ఈ సంఘటనలు మినహా జిల్లా అంతటా దాదాపు ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి.



రాయచోటి మార్కెట్ యార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

## తంబళ్లపల్లెలో టీడీపీకి ఏజెంట్ల కరువు

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలు ఉండగా అందులో తంబళ్లపల్లె మినహా మిగిలిన అన్ని చోట్ల కూటమి నాయకులు అధికార పార్టీకి ఎదురొడ్డి గట్టిగా ఎన్నికలను నిర్వహించారు. అయితే తంబళ్లపల్లె నియోజకవర్గంలో పెద్దమండెం, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో చాలా పోలింగ్ కేంద్రాలలో తెలుగుదేశం పార్టీ ఏజెంట్లను పెట్టలేదు. ఏజెంట్ల విషయం అభ్యర్థి పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

## వెల్లివెరిసిన ఓటరు చైతన్యం

జిల్లాలో ఓటర్లలో చైతన్యం వెల్లివెరిసింది. తెల్లవారుజాము 5.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు చేరుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు అనే తేడా లేకుండా ఓట్లు వేయడానికి జనం ఎగబడ్డారు. చంటి బిడ్డలను చంకనేసుకుని పోలింగ్ బూత్‌ల ఎదుట క్యూలో నిల్చున్నారు. ఉదయం మందకొడిగా పోలింగ్ ప్రారంభం అయింది. అయితే తర్వాత క్రమక్రమంగా పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. జిల్లాలో పలు నియోజకవర్గాలలో సాయంత్రం 6 గంటలు గడువు తీరిన తర్వాత కూడా ఓటర్లు క్యూలో ఉండి ఓట్లు వేశారు. వృద్ధులు, వికలాంగులు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేశారు. జిల్లాలో 76.25 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 14,26,834 ఓట్లు ఉండగా.. 10,87,932 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 5,30,283 ఓట్లు, మహిళలు 5,57,592 మంది, ఇతరులు 57 పోలయ్యాయి. రాజంపేట నియోజకవర్గంలో 75.46 శాతం, రైల్వేకోడూరు నియోజకవర్గంలో 74.13 శాతం, రాయచోటిలో 76.08 శాతం, తంబళ్లపల్లె నియోజకవర్గంలో 80.09, పీలేరులో 79.02 శాతం, మదనపల్లె నియోజకవర్గంలో 73.07 శాతం ఓట్లు పోలయ్యాయి.

## వలంటీర్లను తరిమికొట్టిన ప్రజలు

ఎన్నికల్లో అధికార పార్టీకి మేలు చేయాలనే ఉద్దేశ్యంతో పోలింగ్ మొదలైనప్పటి నుంచి వలంటీర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలో ఉన్న ఓటర్లను ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థించారు. ఇది చూసి ఆగ్రహించిన ప్రజలు పలుచోట్ల వలంటీర్లను తరిమికొట్టారు. రాయచోటి పట్టణంలో బోసనగర్, బాలికల ఉన్నత పాఠశాల, కె.రామాపురం పోలింగ్ కేంద్రాల వద్ద వలంటీర్లను ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తరిమికొట్టారు. కొన్నిచోట్ల వృద్ధులు, వికలాంగుల ఓట్లను వలంటీర్లు ఫ్యాన్ గుర్తుకు వేసే ప్రయత్నం చేయడంతో ఓటర్ల బంధువులు ఆగ్రహించారు.

## మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సోమవారం సాయంత్రం సందర్శించారు. మోడల్ పోలింగ్ కేంద్రంలోని మొత్తం ఓట్లు, వాటిలో పోలైన ఓట్ల గురించి స్థానిక రిటర్నింగ్ అధికారి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఇతర పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి ఓటర్లతో మాట్లాడారు. చివరి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించునే వరకు పోలింగ్ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన వారికి తెలిపారు.



ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యం



లక్కిరెడ్డిపల్లెలో టీడీపీ నాయకుడి బైకును ధ్వంసం చేసిన వైసీపీ కార్యకర్తలు



పుల్లంపేట మండలం దళవాయిపల్లె పోలింగ్ కేంద్రం వద్ద డీఎస్పీతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు



పుల్లంపేట మండలం దళవాయిపల్లె పోలింగ్‌బూత్ లోపల ఈవీఎంలను పగలగొట్టిన దుండగులు



వీరబల్లి మండలం ఓదివీడులో ఓటుహక్కు వినియోగించుకుంటున్న టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



మదనపల్లెలో పోలింగ్ కేంద్రానికి వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న సహాయకుడు



మదనపల్లె రవీంద్రనాథ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



మదనపల్లెలోని మహిళా డిగ్రీ కళాశాల వద్ద గొడవ పడుతున్న టీడీపీ, వైసీపీ కార్యకర్తలు



కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి కిశోర్‌కుమార్ రెడ్డి



రాయచోటిలోని నక్కావాండ్లపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ వర్గీయుల ఘర్షణలో గాయపడిన తిరుపాల్‌నాయుడు



పుల్లంపేట మండలం పాపక్కగారిపల్లెలో వైసీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడ్డ టీడీపీ నేత సుభాష్‌రెడ్డి





చిన్నమండెంలోని శ్రీనివాసపురం పోలింగ్ స్టేషన్‌పైకి రాళ్లు విసురుతున్న వైసీపీ అల్లరి మూకలు, రాయచోటి గర్ల్స్ హైస్కూల్‌లో ఓటర్లకు అభివాదం చేస్తున్న టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి







ములకలచెరువులో ఓటు హక్కును వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి, మదనపల్లెలో ఓటుహక్కు వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా, రైల్వేకోడూరులో ఓటు వేసిన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్

## జమ్మలమడుగులో ఉద్రిక్త వాతావరణం

- సాయంత్రం వెంకటేశ్వర కాలనీ పోలింగ్ బూత్ వద్ద ఘర్షణ

జమ్మలమడుగు, మే 13: వెంకటేశ్వర కాలనీ, ఈద్గా సమీప పోలింగ్ బూత్ వద్ద ఘర్షణ జరిగింది. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వారి శ్రేణులు పోలింగ్ బూత్ వద్దకు చేరుకుని ఓటర్లను ప్రభావితం చేస్తూ మాట్లాడుతున్నారని సమాచారం. దీంతో అక్కడికి టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి చేరుకున్నారు. అప్పటికే ఇరువర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. డీఎస్పీ యశ్వంత్ కేంద్ర బలగాలు కార్యకర్తలను పోలింగ్ కేంద్రం వద్ద నుంచి పంపించారు. దారిలో టీడీపీ శ్రేణుల వాహనం అద్దాలు పగులకొట్టారు. దీంతో అక్కడే ఉన్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ మాటా మాటా పెంచినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఇరువర్గాలు పట్టణంలో ఉద్రిక్త వాతావరణంగా కార్యకర్తలు పార్టీ కార్యాలయాల వద్దకు చేరుకున్నారు. వెంటనే డీఎస్పీ యశ్వంత్ టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, చివరి సమయంలో అనవసరంగా గొడవలు వద్దని ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డితో చెప్పడంతో ఆదినారాయణరెడ్డి కార్యకర్తలతో మాట్లాడి దేవగుడికి వెళ్లిపోయారు. ఏది ఏమైనా పట్టణంలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో పోలీసు బలగాలు మోహరించాయి.

## కరపత్రాల కలకలం



పోరుమామిళ్లలో కలకలం రేపిన కరపత్రాలు

పోరుమామిళ్ల, మే 13: పోరుమామిళ్లలో కరపత్రాల కలకలం వైరల్‌గా మారింది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఆర్టీసీ బస్టాండు వద్ద, మహాత్మాగాంధీ విగ్రహం, వెంకటేశ్వర జూనియర్ కళాశాల. సుందరయ్యకాలనీకి వెళ్లే దారి సహా చాలా ప్రాంతాల్లో చంద్రబాబుకు వ్యతిరేకంగా కొందరు కరపత్రాలు ముద్రించి పారవేశారు. బాబు అధికారంలోకి వస్తే పథకాలు రావంటూ ఆయనకు వ్యతిరేకంగా కర పత్రాలను ముద్రించి పారవేశారు. పథకాలు బాబు ఆపేస్తాడు, బాబు మళ్లీ వస్తే పథకాలు రద్దు, పింఛన్లు రద్దు, రిజర్వేషన్లు రద్దు అంటూ టీడీపీకి వ్యతిరేకంగా కరపత్రాలను అక్కడక్కడా జారవిడిచారు. ఎవరూ లేని సమయంలో కొందరు జారవిడిచారు. పంచాయతీ కార్యాయలం వద్ద ఉన్న కరపత్రాలను పోలీసు అధికారులు పంచాయతీ సిబ్బందిని పురమాయించి వాటిని కాల్పించారు. అయినా టీడీపీ అంటే ఓర్వలేని కొందరు దుష్ప్రచారం చేసేందుకు ఈ కరపత్రాలను ముద్రించి ప్రధాన ప్రాంతాల్లో జారవిడిచారు. ఆయన పదవిలో లేనప్పుడే ఇంత చేస్తే వస్తే గనుక పథకాలు బంద్ ఆంధ్ర ఓటరులాగా జాగ్రత్త అంటూ టీడీపీకి వ్యతిరేకంగా కరపత్రాలను అక్కడ పారవేశారు. కొందరు వైసీపీ వారు ఓటమి భయంతోనే ఇలా చేసి ఉంటారని ధైర్యంగా ఎదుర్కోలేక దొడ్డిదారిలో ఈ కరపత్రాలు జారవిడవడం ఏమిటంటూ శాపనార్థాలు పెట్టారు.

## కమనీయం.. సీతారాముల కల్యాణం



వాల్మీకిపురం, మే 13: వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. నిత్య కైంకర్యాల అనంతరం నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణలు గావించి ఆలయం మండపంలో పుష్పాలం కరణలతో తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ కల్యాణ వేడుకలు కమనీయంగా సాగాయి. చివరగా హోమాలు గావించి కల్యాణంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం విశేష అలంకరణలతో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిలో పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



గాయపడిన బీజేపీ ఏజెంట్ నాగార్జునరెడ్డి

# చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

నాగవరం పోలింగ్ కేంద్రంలో బీజేపీ ఏజెంట్‌పై వైసీపీ మూకల దాడి

పుల్లంపేట దళాయిపల్లె పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన వైనం

రైల్వేకోడూరు హెచ్‌ఎంఎం హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో రిగ్గింగు జరుగుతుందని మోహరింపు

రైల్వేకోడూరు, మే 13: నియోజకవర్గంలో సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో చెదురుముదురు సంఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎండ వేడిమి తట్టుకోలేమని వృద్ధులు ఉదయాన్నే వచ్చి బారులు తీరి ఓట్లు వేశారు. కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మెరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభించారు. వికలాంగులు సైతం ఓటు వేసేందుకు ముందుకొచ్చారు. పుల్లంపేట మండలం అనంతసముద్రం పాపక్కగారిపల్లెలో జనసేన ఏజెంట్‌గా సుబ్రహ్మణ్యం ను కూర్చో బెట్టేందుకు టీడీపీ నేత ముద్దా సుభాష్‌రెడ్డి తీసుకుని వెళుతుండగా వైసీపీ నేతలు కిడ్నాప్ చేశారు. వైసీపీ నేతలు జరిపిన దాడిలో టీడీపీ నేత సుభాష్‌రెడ్డి గాయపడ్డారు. జనసేన ఏజెంట్ సుబ్రహ్మణ్యం కన్ను దెబ్బతినింది. దీంతో వారిద్దరిని చికిత్స నిమిత్తం రాజంపేట కూటమి నేతలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జాగువారిపల్లెలో జనసేన ఏజెంట్‌ను భయటకు లాగేసి వైసీపీ వాహనంలో తీసుకెళ్లారు. దీంతో సుమారు గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. తర్వాత ఒక ఏజెంట్ కూర్చున్న తర్వాత పోలింగ్ నిర్వహించారు. రెండో సారి కూర్చున్న ఏజెంట్‌ను కూడా వైసీపీ నేతలు లాగేశారు. ఇదిలా ఉండగా పుల్లంపేట మండలం దళాయిపల్లె పోలింగ్ కేంద్రానికి వైసీపీ నేతలు చేరుకుని జనసేన ఏజెంట్ రాజారెడ్డిపై దౌర్జన్యం చేసి దాడి చేశారు. ఇతన్ని కూడా కిడ్నాప్ చేయడానికి విఫలయత్నం చేశారు. దీంతో గ్రామస్థులు ఈవీఎంను ధ్వంసం చేశారు. సుమారు రెండున్నర గంటల పాటు పోలింగ్ ఆగిపోయింది. విషయం తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడ్డం చంగల్ రాజు కూటమి శ్రేణులు దళావాయిపల్లెకు చేరుకుని రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రౌడీలు, గూండాలు దాడి చేస్తే వారిని ఏమీ అనకుండా పోలీసులు నిమ్మకున్నారని, ఏజెంటు లేకుండా ఎలా పోలింగ్ నిర్వహించాలని, ఉన్న ఏజెంట్లను పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఎంత వరకు సబబని కూటమి నేతలు ప్రశ్నించారు. వైసీపీ గూండాలు, రౌడీలకు పోలీసులు సెల్యూట్ చేయడం సిగ్గు చేటన్నారు. వైసీపీ నేతలకు పోలీసులు కొమ్ముకాచి కూటమి కార్యకర్తలు, ఏజెంట్లను ఇబ్బందికి గురి చేశారన్నారు. ఈ పోలింగ్ సమస్యాత్మకంగా ఉందని అధికారులకు తెలిసినా ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం వల్ల సమస్య ఎదురైందని మహిళా ఓటర్లు అధికారులను నిలదీశారు. ఈ విషయమై రైల్వేకోడూరు ఎన్నికల అధికారి లీలారాణి వచ్చి ఆరా తీశారు. జిల్లా పోలీసు అదనపు అధికారి రాజ్‌కమల్ చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఎన్నికల అధికారులతో పోలీసులు చర్చించి మరో ఈవీఎంను తెప్పించి పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి చర్యలు తీసుకు న్నారు. పుల్లంపేట 183 పోలింగ్ కేంద్రంలో రెండు గంటల పాటు ఈవీఎంలు మోరాయించడంతో ఓటర్లు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వేకోడూరులోని హెచ్‌ఎంఎం హైస్కూలు లోని పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ రిగ్గింగుకు పాల్పడుతోందని కూటమి శ్రేణులకు సమాచారం అందడంతో కూటమి శ్రేణులు భారీగా స్కూలు వద్దకు చేరుకున్నారు. అంత కంటే ముందుగా ఎంపీడీఓ కార్యాలయంలో వైసీపీ శ్రేణులు భారీగా ఉండడంతో కూటమి శ్రేణులు వెళ్లి కేకలు పెట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయాన్ని రాజంపేట డీఎస్పీ చైతన్య ఇరువర్గాలకు నచ్చజెప్పి సర్దుబాటు చేశారు. ఒకరి తర్వాత ఒకరిని భయటకు పంపే క్రమంలో టోల్గేట్ సమీపంలో ఇరు వర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. దీంతో పోలీసు లు లాఠీ చేశారు. చిట్వేలి మండలం నాగవరం పోలింగ్ కేంద్రంలో బీజేపీ ఏజెంట్ నాగార్జునరెడ్డి పై వైసీపీ మూకలు దాడి చేసి గాయపరిచారు. దీంతో చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో నాగార్జునరెడ్డి ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఓబులవారిపల్లె మండలంలో చెదుముదురు సంఘటనలు జరిగాయి.

పెనగలూరు మండలం కొండూరు పోలింగ్ కేంద్రంలో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పోలీసులు వైసీపీ శ్రేణులకు అనుకూలంగా వ్యవహరించారని కూటమి నేతలు ఆరోపించారు. చాలా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు చంటి బిడ్డలను ఎత్తుకుని మహిళలు వచ్చారు. టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, అభ్యర్థులు పోలింగ్ సరళిని పరిశీలించారు. చాలా పోలింగ్ కేంద్రాల వద్దకు ఉదయం 6 గంటలకు ఓటర్లు రావడం విశేషం.







తూర్పుపల్లెలో వృద్ధురాలిని ఓటింగ్‌కు తీసుకు వెళుతున్న గ్రామస్తులు - రాఘవరాజపురం పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు - రైల్వేకోడూరులో చంటి బిడ్డలతో ఓటు వేసేందుకు

## ఐడీపీఎస్ విద్యార్థుల ప్రతిభ

చాపాడు, మే 13: సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. హసిఫా 553, యహిత్‌రెడ్డి 538, మహమ్మద్ అఫ్సాన్ 522, వెంకటహర్షవర్ధన్ 517 సాధించారన్నారు. మరో ఐదుగురు విద్యార్థులు కూడా మంచి మార్కులు సాధించినట్లు చెప్పారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించి మొదటిస్థానాల్లో నిలవడం సంతోషకరమన్నారు. డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ పాఠశాల తొలి ఫలితాల నుంచే విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం గర్వకారణమన్నారు.



షేక్ ఆసిఫా | యషితారెడ్డి | మహ్మద్ అఫాన్ | సాయి మహేశ్వరి | వెంకట హర్షవర్ధన్

## ఓటు వినియోగించుకున్న అభ్యర్థులు, ప్రముఖులు



ఓటు వేస్తున్న కస్తూరి విశ్వనాథనాయుడు - ఓటు వేసిన టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, పంతగాని నరసింహప్రసాద్ కుటుంబీకులు

రైల్వేకోడూరు, మే 13: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు, టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, ముక్కా విశాల్‌రెడ్డి, ముక్కా ప్యామిలి ఓటు ను వారి, వారి పోలింగ్ కేంద్రాల్లో వినియోగించుకున్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



నందలూరు, మే13: నూకినేనిపల్లె యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వక్కాకుల వెంకట ప్రసాద్ (28) సోమవారం తెల్లవారు జామున మృతుని ఇంటి సమీపంలో రోడ్డు పై మృతి చెందిపడి ఉండడంతో గ్రామస్థులు, బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి శవపరీక్ష నిమి త్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు.

# వైసీపీ కవ్వింపు చర్యలున్నా ప్రశాంత పోలింగ్

- ఓటమి భయమే కారణమంటున్న విశ్లేషకులు
- ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసుల చర్యలు
- సంయమనం పాటించిన వరదరాజుల రెడ్డి







కామనూరులో టీడీపీ కార్యకర్తలతో గొడవకు దిగుతున్న బంగారురెడ్డి కుమారుడు విజయమునిరెడ్డి - పోలీసుల అదుపులో కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి, టీడీపీ నేత నారాయణరెడ్డి, రామేశ్వరం హైస్కూల్ వద్ద వృద్ధురాలిని తీసుకొస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు మే 13: ప్రొద్దుటూరులో పోలింగ్ జరిగిన సరళిలో ఓటర్లు టీడీపీకి అనుకూలంగా మొగ్గుచూపుతున్నారన్న సమాచారంతో వైసీపీ నేతల్లో ఆందోళన మొదలైంది. దీంతో కొన్ని చోట్ల వైసీపీ నేతలు కవ్వింపు చర్యలకు దిగారు. ముఖ్యంగా టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి స్వగ్రామం కామనూరుకు వైసీపీ నేత రాచమల్లు కిరణ్ రెడ్డి కుమారుడు రాఘవేంద్రారెడ్డి, బంగారు రెడ్డి కుమారుడు విజయమునిరెడ్డి పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లడంతో టీడీపీ నేతలు కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఏమైతే రాకూడదా అంటూ రెచ్చగొట్టేలా వీరు ఇద్దరు కవ్వింపు చర్యలకు దిగారు. దీంతో అక్కడే వున్న పోలీసులు వారి ఇద్దరిని పోలింగ్ బూత్ నుంచి తీసుకెళ్లి కారు ఎక్కించి అక్కడి నుంచి పంపించి వేశారు.

దొరసానిపల్లెలో మాజీ మహిళా వలంటీర్లు ముగ్గురు కొందరు వృద్ధులను ఇంటి నుంచి తీసుకొచ్చి బూత్‌ల వద్ద ఓట్లు వేయిస్తుంటే టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ నేత లక్ష్మీనారాయణ రెడ్డి టీడీపీ నేతలతో వాగ్వాదానికి దిగి దౌర్జన్యానికి తెగబడ్డారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది.

4 వవార్డు గౌతమ్ స్కూల్ బూత్ వద్ద 3వ వార్డు కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మీవుండగా 4 వ వార్డు వైసీపీ కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి ఆమెను అసభ్యంగా దూషించినట్లు ఆమె వివరించింది. ఆమె అక్కడే విధుల్లో వున్న సీఐ వెంకట రమణకు తెలిపింది. దీంతో సీఐ ఓబులరెడ్డిని అక్కడి నుంచి పంపిస్తూ ఆమెను బూత్ నుంచి పంపించేశారు.

ఖాదర్ హుస్సేన్ మసీదు వీధి బూత్‌లో వైసీపీ కార్యకర్త హల్‌చెల్ చేయడంతో 22 వవార్డు కౌన్సిలర్ మహ్మద్ గౌస్ వర్గం అభ్యంతరం పెట్టారు. దీనిపై వైసీపీ కార్యకర్తలు బూత్‌వద్ద గుంపులుగా చేసి దౌర్జన్య చర్యలకు దిగే ప్రయత్నంలో ఎస్ఐ షైమావతి వారిని అక్కడి నుంచి చెదరగొట్టింది.

బూత్ వద్ద వైసీపీ వర్గం దొంగ ఓట్లు వేసుకోకుండా అక్కడే వున్న వైసీపీ నుంచి టీడీపీ చేరిన కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, టీడీపీ నేత వంగల నారాయణరెడ్డిని అరెస్టు చేసి త్రీటౌన్ సీఐ వెంకట రమణ స్టేషన్‌కు తరలించారు. వైసీపీ నేతలను మాత్రం స్టేషన్‌కు తీసుకురాకపోవడం పై వారు సీఐని నిలదీశారు.

మోడంపల్లెలో టీడీపీ కార్యకర్తపై టూటౌన్ సీఐ కరీం చేయిచేసుకున్నారు. ఈ విషయం టీడీపీ నేతల దృష్టికి రావడంతో సీఐని వరదరాజులరెడ్డి ప్రశ్నించారు.

సాయంత్రం పోలింగ్ ముగిసే సమయంలో కొశెట్టిహైస్కూల్‌లో పోలింగ్‌ను పర్యవేక్షించడానికి వచ్చి ఆవరణలో టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి కూర్చున్నారు. అక్కడ సిబ్బంది టీ ఇస్తే తాగుతూ వుండగా వైసీపీ అభ్యర్థి రాచమల్లుకు సమాచారం చేరడంతో ఆయన చేరుకుని బూత్ లోకి వెళ్ళి కూర్చున్నాడు. దీంతో వరదరాజులరెడ్డి డీఎస్పీకి ఫిర్యాదు చేయగా పోలీసులు ఆయనను బయటికి పంపించేశారు. దీంతో వరదరాజులరెడ్డిని కూడా పంపించమని రాచమల్లు పోలీసులను ప్రశ్నించారు. మీరు వెళ్లిన వెంటనే వరదరాజుల రెడ్డిని కూడా పంపిస్తామని ఇద్దరు ఒకే సారి వెళితే ఘర్షణలు జరుగుతాయని పోలీసులు వెళ్ళడించారు. కొశెట్టి స్కూలు నుంచి అంబేద్కర్ విగ్రహం వద్ద వరదరాజులరెడ్డి యూటర్న్ తీసుకుంటుండగా రాచమల్లు కిరణ్‌రెడ్డి కుమారుడు రాఘవేంద్రారెడ్డి, బంగారెడ్డి కుమారుడు విజయమునిరెడ్డి వంద మంది యువకులను గుంపుగా పెట్టుకుని కేకలు వేశారు. వరదరాజులరెడ్డితో కవ్వింపు చర్యలకు దిగారు. దీంతో వరదరాజులరెడ్డి మనుషులు దిగుతుండగా అక్కడే వున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు వైసీపీ యువకుల గుంపును చెదర గొట్టారు. దీనిని బట్టి వైసీపీ నేతలకు ప్రొద్దుటూరులో ఓటమి భయంతో అడుగడుగునా కవ్వింపు చర్యలకు పాల్పడేందుకు యత్నించారు. ఆయితే పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకుని ఘర్షణలు నివారించే ప్రయత్నం చేశారు,

### ఈవీఎంల మొరాయింపు

ప్రొద్దుటూరులో ఉదయం కొన్ని పోలింగ్‌బూత్‌లలో ప్రారంభం కావాల్సిన పోలింగ్ ఈవీఎంలు మొరాయించడంతో కొంత సమయం ఆలస్యమైంది. వెదుర్ల బజార్‌లోని పోలింగ్ బూత్ రామేశ్వరం ప్రైమరీ స్కూలు బూత్‌లో చెన్నమరాజుపల్లె బూత్‌లలో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించే సరికి వాటని టెక్నికల్ సిబ్బందిని పిలిపించి సరిచేశారు. దీంతో కొంత సమయం పోలింగ్ ఆలస్యమైంది.

### పోలింగ్ సరళి పర్యవేక్షించిన అభ్యర్థులు

సార్వత్రిక ఎన్నికల ఘట్టం సోమవారం ఉదయం 5 గంట నుంచే పోలింగ్ కేంద్రాల్లో ప్రారంభమైంది. ఉయాన్నే 5 గంటలకు ఏజంట్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఏజంటు ఫారాలను పోలింగ్ అధికారులను అప్పగించారు. ఏజంట్లను బూత్‌లలో కూర్చోపెట్టి మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు బారులు తీరారు. సరిగ్గా 7గంటలకు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియను పోలింగ్ అధికారులు ప్రారంభించారు. పురుషులు మహిళలు యువకులు పెద్ద ఎత్తున క్యూలైన్‌లో నిలబడ్డారు. చాలా పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు వికలాంగులు వీల్ చైర్‌లలో వచ్చి ఓటు వేశారు. 95 ఏళ్ళ నిండిన సీనియర్ అడ్వకేట్ సింగం రెడ్డి క్రిష్టారెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### పటిష్ట బందోబస్తు

పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే రాచముల్ల ప్రసాద్‌రెడ్డి ఆయన బావమరిది బంగారురెడ్డి వుండే ఏరియాలైన రామేశ్వరం వసంతపేటలలో వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ ఎస్ఐ షైమావతి పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు లేకుండా అన్ని పోలింగ్ కేంద్రాలను తిరుగుతూ పర్యవేక్షించారు. డీఎస్పీ మురళీధర్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఉదయం నుంచే టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వరదరాజులరెడ్డి, రాచమల్లు ప్రసాద్ రెడ్డి పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు.

### రాత్రి 9 వరకు సాగిన పోలింగ్

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మొత్తం 268 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రొద్దుటూరు మున్సిలిటీ, ప్రొద్దుటూరు మండలం, రాజుపాలెం మండలం ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుంచే క్యూ కట్టారు. మొత్తం నియోజకవర్గంలో 2,47,966 ఓటర్లువుండగా అందులో పురుషులు 1,19,985 స్త్రీలు 1,27,933 ,ఇతరులు 48 వున్నారు. పురుషులకంటే స్త్రీలు 7,948 మంది అధికంగా వున్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తంలో మహిళలు సైతం ఎక్కువ శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల్లో 78 శాతం ఓటు హక్కును వినియోగించుకోగ ఈ ఎన్నికల్లో 85 శాతం పైగా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. రాత్రి 10 గంటల సమయానికి 80 శాతం లెక్క తేలినట్లు వెల్లడిస్తున్నారు.





లిటిల్ ఏంజెల్స్ స్కూల్ వద్ద బారులు తీరిన ఓటర్లు - మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో ఓటర్లుకు సూచనలిస్తున్న డీఎస్పీ మురళీధర్



రాజంపేట పట్టణంలోని పోలింగ్ స్టేషన్ల వద్ద పహరా కాస్తున్న పోలీస్‌దళాలు



మున్సిపాలిటీలోని కొతపల్లె ఉర్దూ స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద గుంపులుగా ఉన్న ఓటర్లను పంపుతున్న పోలీసులు



రాజంపేట: క్యూలైన్ పాటించక పోవడంతో గుంపులుగా నిలిచిపోయిన ఓటర్లు

## చెదురుమదురు సంఘటనలు మినహా..

# ప్రశాంతంగా పోలింగ్

రాయచోటిటౌన్, మే13: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలోని 9 గ్రామ పంచాయతీల్లో చెదురు మదురు సంఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ 7 గంటలకే అయినా ఉదయం 5.30 గంటలకే పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లె మోడల్ ఉర్దూ ప్రైమరీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో సుమారు అర్ధకిలోమీటరు మేర ఓటర్లు క్యూ లైన్‌లో నిలబడ్డారు. రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం నక్కావాండ్లపల్లె పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైసీపీ, టీడీపీ వర్గీయులు బాహాబాహీకి దిగడంతో తిరుపాల్‌నాయుడు అనే వైసీపీ నాయకుడికి గాయాలయ్యాయి. పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో 126వ పోలింగ్ భూత్ వద్ద వైసీపీ నేత దశరథరామిరెడ్డిని టీడీపీ నేత రమణారెడ్డి బూత్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి రంగ ప్రవేశం చేసి ఇరువురికి సర్దిచెప్పి అక్కడ నుంచి పంపించేశారు. మొత్తం మీద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఓటర్లు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మాసాపేట మార్కెట్ యార్డు సమీపంలోని పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తపేట రామాపురంలోని మండల పరిషత్ ఆదర్శ పాఠశాల పోలింగ్ కేంద్రంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి రామాపురం మండలం సుద్దమళ్ల గ్రామం ఎర్రమరెడ్డిగారి పల్లెలో కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిన్నమండెం మండలం పడమటికోట గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరబల్లి మండలం ఓదివీడు గ్రామంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పట్టణం లోని గర్ల్స్ హైస్కూల్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, మార్కెట్ పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్. అల్లాబకష్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



రాయచోటి మున్సిపాలిటీలోని కొత్తపల్లె ఉర్దూ స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

**రాజంపేట:** రాజంపేట, రైల్వేకోడూరు నియోజక వర్గాల్లో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. రాజంపేట డీఎస్పీ చైతన్య నిష్పక్షపాతంగా వ్యవహరించారు. తెల్లవారు జామునుంచే పెద్ద ఎత్తున ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. రాజంపేట పట్టణంలోని మన్నూరు పోలింగ్ కేంద్రాలు, ఒకటిరెండు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. ఓటింగ్‌కు మహిళలతో పాటు యువతీ, యువకులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. అవ్వాతాతలు కూడా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేసి వెళ్లారు. కొందరు తమ మనవళ్ల, మనవరాళ్ల సహాయంతో వీల్‌చైర్‌లలో కూడా వచ్చి ఓట్లు వేశారు. వికలాంగులు కూడా ఎంతో ఉత్సాహంతో ఓటింగ్ కేంద్రాలకు వచ్చారు. రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డిలు ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు వీరబల్లి మండలం ఓదివీడులో , రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ దంపతులు రాజంపేట మండలం యల్లాగడ్డలో , వైసీపీ అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తన స్వగ్రామం ఆకేపాడులో ఓటుహక్కు వినియోగించారు. కోడూరులో ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు రెడ్డివారిపల్లెలోనూ, జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌తో పాటు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. పారిశ్రామిక వేత్త గంటా నరహరి మన్నూరులో ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి నందలూరు మండలం ఎర్రజెరువుపల్లె పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులందరూ తన స్వగ్రామం ఎర్రజెరువుపల్లెలో కాకుండా యల్లాగడ్డలో ఓటుహక్కును వినియోగించుకోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. -ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా రాజంపేట ప్రాంతంలో మధ్యాహ్నం 1గంటకు 40.79 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 3గంటలకు 53.3 శాతం,. సాయంత్రం 5గంటలకు 62.67 శాతం 6.58గంటలకు ఏకంగా 70.30 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- **ఎవరి ధీమా వారిదే... :**

ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకున్నారు. ఈ సమయంలో ప్రధాన పార్టీ నాయకులు, అభ్యర్థులు తామంటే తాము గెలుస్తామన్న ధీమాతో ఉన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు తమకు అనుకూలించడంతో వైసీపీ నేతలకు పోటీగా పైసలు పంచకపోయినా గెలుస్తామన్న ధీమాతో టీడీపీ నేతలు ఉన్నారు. రాజంపేట పట్టణం, రూరల్, నందలూరు, సుండుపల్లి, సిద్దవటంలో టీడీపీకి ఎక్కువ మెజారిటీ వస్తుందని ఒంటిమిట్టలో వైసీపీకి కొంత అనుకూలించినట్లు కనపడ్డా అది పెద్ద ప్రభావం చూపబోదని, ఇక వీరబల్లిలో పోటీ నువ్వానేనా అన్న రీతిలో ఉందని టీడీపీ నేతలు ధీమాతో ఉన్నారు. టీడీపీ నేతలు పైకం పంచకపోవడం తమకు బాగా కలిసి వస్తుందనుకుంటున్నారు. సంక్షేమ పథకాల కారణంగా తాము గెలుస్తామని వైసీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వచ్చి సేద తీరుతున్న వృద్ధులు



గుదియవాండ్లపల్లె గుట్టపల్లె పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరిన మహిళా ఓటర్లు



పెమ్మాడపల్లెలో వృద్ధురాలిని ఎత్తుకుని తీసుకెళ్తున్న దృశ్యం



తల్లి ఓటేసేందుకు వెళ్లడంతో బిడ్డను లాలిస్తున్న తండ్రి

# బరితెగించిన వైసీపీ..

- కొల్లం గంగిరెడ్డి, ముద్దా బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు
- వైసీపీ నేతల ఆగడాలకు వ్యతిరేకంగా ఈవీఎంల ధ్వంసం
- టీడీపీ, జనసేన నేతలపై దాడులు.. కిడ్నాప్‌లు

రాజంపేట, మే13 : టీడీపీ, జనసేన నాయకులపై దాడులు, ఏజెంట్ల కిడ్నాప్‌తో సార్వత్రిక వైసీపీ నేతలు పుల్లంపేట మండలంలో భయాందోళనలు సృష్టించారు. అంతర్జాతీయ స్మగ్లర్‌గా గుర్తింపు పొంది, పలు కేసుల్లో నిందితుడైన ఉన్న కొల్లం గంగిరెడ్డి, పుల్లంపేట మండలాధ్యక్షుడు ముద్దా బాబుల్‌రెడ్డి సోమవారం తెల్లవారుజామున 5.30గంటలకే అనంతసముద్రం పంచాయతీ పాపక్కగారిపల్లెలో ఏజెంట్లను తీసుకెళుతున్న టీడీపీ నాయకుడు కొల్లం సుభాష్‌రెడ్డిన కిడ్నాప్‌చేసి దాడి చేశారు. రాడ్లతో చితకబాదడంతో తీవ్రంగా గాయపడిన ఆయనను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాపక్కగారిపల్లెలో జంక్షన్ ఏజెంట్ సుబ్రమణ్యంపై దాడి చేయడంతో అతని కన్ను దెబ్బతినింది. పాపక్కగారిపల్లెలో టీడీపీ నాయకుడు, ఏజెంట్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించిన ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి కుమారుడు రంజిత్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి రాజంపేటకు తరలించారు. జాగువారిపల్లె పంచాయతీలో ఏజెంట్లను ముద్దా బాబుల్‌రెడ్డి బలవంతంగా బయటకు లాక్కెళ్లడంతో, సుమారు గంటకు పైగా పోలింగ్ ఆగిపోయింది. జనసేన ఏజెంట్ రావడంతో తిరిగి పోలింగ్ ప్రారంభమైంది. మరికొద్ది సేపటికే ఆ ఏజెంట్‌ను బయటకు లాగేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. అక్కడి నుంచి ముద్దా బాబుల్‌రెడ్డి, గంగిరెడ్డిలు దళవాయిపల్లె పోలింగ్ కేంద్రానికి చేరుకొని పోలీసులు, అధికారుల ముందే జనసేన ఏజెంట్ రాజారెడ్డిపై దాడికి పాల్పడ్డారు. సుమారు 20 మందికి పైగా రాజారెడ్డిపై దాడి చేసి కిడ్నాప్‌కు ప్రయత్నించారు. గ్రామస్తులు అడ్డుకోవడంతో వెళ్లిపోయారు. ఆగ్రహించిన గ్రామస్తులు ఈవీఎంలను పగలగొట్టారు. పోలింగ్ కేంద్రం వద్ద నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డి టీడీపీ, జనసేన నాయకులతో కలిసి దళవాయిపల్లెకు చేరుకున్నారు. అప్పటికే రాజంపేట డీఎస్పీ చైతన్య పోలింగ్ కేంద్రానికి చేరుకొని పోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. రిటర్నింగ్ అధికారి లీలారాణి కొత్త ఈవీఎంలు తెప్పించి పోలింగ్‌ను ప్రారంభించేందుకు సన్నద్ధమవ్వడంతో ముక్కారూపానందరెడ్డి లీలారాణి, డీఎస్పీపై మండిపడ్డారు. ఏజెంట్లు లేకుండా ఎలా పోలింగ్ ప్రారంభిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకముందే అడిషనల్ ఎస్పీ రాజకుమార్‌కూడా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి డీఎస్పీ చైతన్యకు సూచనలిచ్చారు._ ఎస్పీ, కలెక్టర్లు కూడా డీఎస్పీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారితో మాట్లాడి పోలింగ్ సజావుగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో టీడీపీ తరపున ఏజెంట్లను కూర్చోపెట్టి పోలింగ్ ప్రారంభించిన కొద్దిసేపటికే వైసీపీ ఏజెంట్లతో రాజంపేట రూరల్ సీఐ కుమ్మక్కయ్యాడంటూ జనసేన ఏజెంట్లు బయటకు వచ్చారు. ఆ తరువాత తిరిగి నచ్చజెప్పినా ఏజెంట్లు లోపలికి వెళ్లలేదు. పోలీసులు వైసీపీకి కోవట్లుగా వ్యవహరించి టీడీపీ ఏజెంట్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటలకు పైగా ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. కొద్ది సేపు రీపోలింగ్ జరపాలని జనసేన నాయకులు రోడ్డుపై బైఠాయించారు. చివరకు టీడీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లి పోలింగ్‌ను ప్రారంభించారు. దళవాయిపల్లె పోలింగ్‌కేంద్రం సమస్యాత్మకంగా ఉన్నా, అధికారులు గానీ, పోలీసులు గానీ చర్యలు తీసుకోకపోవడం దారుణమని డీఎస్పీ చైతన్యను, రిటర్నింగ్ అధికారి లీలారాణిని మహిళలు నిలదీశారు.



పుల్లంపేట: టీడీపీ ఏజెంట్లను వైసీపీ నేతలు అడ్డుకోవడంతో ఆగిపోయిన పోలింగ్.. ఎదురుచూస్తున్న ఓటర్లు



లక్కిరెడ్డిపల్లె: సంఘటన స్థలానికి చేరుకున్న అడిషనల్ ఎస్పీ హైమావతి, డీఎస్పీ శ్రీధర్

### చౌటపల్లె పోలింగ్ కేంద్రం వద్ద రెండు గంటల పాటు ఉద్రిక్తత

లక్కిరెడ్డిపల్లె మే 13: మండలంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం అక్కడక్కడ చిన్న చిన్న గొడవలు చోటు చేసుకున్నాయి. ఉదయం 12 గంటల సమయంలో చౌటపల్లెలోని పోలింగ్ కేంద్రం 32 లోనికి తెలుగుదేశం పార్టీ కార్యకర్త వెళ్లడంతో, వైసీపీ ఏజెంట్లు అడ్డగించారు. దీంతో మొదలైన వాగ్వాదం గొడవకు దారితీసింది. దీంతో ఇరువర్గాల కార్యకర్తలు రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘర్షణలో టీడీపీ కార్యకర్తలకు చెందిన 5 బైకులు ధ్వంసమయ్యాయి, కారు అద్దాలు పగలకొట్టారు. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. అదనపు ఎస్పీ హైమావతి, డీఎస్పీ శ్రీధర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చంచర్లపల్లె, బి యర్రగుడి, దప్పేపల్లె, రెడ్డివారిపల్లె, అనంతపురం పోలింగ్ కేంద్రాల వద్ద చిన్నచిన్న గొడవలు చోటు చేసుకున్నాయి. సాయంత్రం వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సీఐ జీవన్ గంగనాథ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్ మొబైల్ టీమ్‌లు బందోబస్తు నిర్వహించారు.



రాళ్ల దాడిలో పగిలిపోయిన కారు అద్దాలు



పుల్లంపేట: దాడిలో గాయపడిన యువకుడు

## 'రాయచోటి కోటపై టీడీపీ జెండా ఎగరేస్తాం'

రాయచోటిటౌన్, మే13: రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది తెలుగుదేశం పార్టీనేనని, రాయచోటి కోటపై కూడా టీడీపీ జెండా ఎగురేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్ హుస్సేన్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని దప్పేదారిపల్లెలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తెలుగుదేశం పార్టీపై మొగ్గు చూపుతున్నారని, తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షి స్తూ మార్పు కోరుకుంటున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతల అక్రమాలు, అరాచకాలు పెరిగిపోయాయన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి అనేది కనిపించ లేదన్నారు. వైసీపీ అరాచకాలకు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతూ ఓటు రూపంలో తమ నిరసన వ్యక్తం చేశారని చెప్పారు. యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు ద్వారా వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచారన్నారు. జూన్ నెల 4 తర్వాత రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపడుతుందని, రాయచోటిలో తెలుగుదేశం జెండా ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



యల్లాగడ్డ లో ఓటువేసి వేలిపై సిరా గుర్తు చూపుతున్న సాయిలోకేష్ దంపతులు



కొత్తపేట రామాపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న డీఆర్‌వో సత్యనారాయణ, కుటుంబ సభ్యులు..

## గాలివీడులో బారులు తీరిన ఓటర్లు



పోలింగ్ కేంద్రం వద్ద గుంపులుగా ఓటర్లు

గాలివీడు, మే 13: ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరారు. చాలా గ్రామాల్లో ఈవీఎంలు ఉదయం కొంత వరకు మొరాయించాయి. అయితే కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. 80 శాతం పైగా పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. నూలివీడు పంచాయతీ నాగూరివాండ్లపల్లెలో రాత్రి 9 గంటల వరకు ఓటర్లు క్యూలో నిలుచున్నారు. లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్‌గంగాధర్‌బాబు, గాలివీడు ఎస్ఐ వెంకటప్రసాద్ అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రశాంతంగా ఎన్నికలు ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

## వైసీపీ నేతల రాళ్ల వర్షం



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న మండిపల్లి సతీమణి హరితరెడ్డి

చిన్నమండెం, మే13: కొత్తపల్లి గ్రామ పంచాయతీ శ్రీనివాసపురం పోలింగ్ బూత్‌లో టీడీపీకి అనుకూ లంగా ఓట్లు పడుతున్నాయన్న ఉద్దేశంతో ఉదయం 12 గంటల సమయంలో వైసీపీ నేతలు రాళ్ల వర్షం కురిపించారు. పోలింగ్ కేంద్రం తలుపులు మూసేశారు. వైసీపీ నాయకుల ఇళ్లపై రాళ్లు ఉన్నాయని టీడీపీ అభ్యర్థి సతీమణి హరితరెడ్డి ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. మిద్దెల మీద ఉన్న రాళ్ల కుప్పలను తొలగించారు. బోనమల, కొత్తపల్లి పోలింగ్ స్టేషన్‌లో చిన్న చిన్న సంఘటనలు మినహా మండల వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా సాగుతోంది. పోలింగ్ సరళిని హరితరెడ్డి పరిశీలించారు.

## సుండుపల్లెలో ప్రలోభాల వల

సుండుపల్లె, మే13: సుండుపల్లె మండల వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. పలు గ్రామ పంచాయతీల్లో వైసీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. అయితే ఒకటి, రెండు చోట్ల మినహా మిగిలిన అన్ని కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడంతో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నాలు చేయడంతో ఏజెంట్లు వారిని గుర్తించి వెనక్కి పంపారు. సాంకేతిక లోపాల వలన ఓటర్లు ఎక్కువ సమయం క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. సాయంత్రం 6 గంటలు అయినా ఓటర్లు క్యూలోనే నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## మొరాయించిన ఈవీఎంలు



ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు నమస్కరిస్తున్న టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం

సిద్దవటం, మే 13 : సిద్దవటం ఎగువపేట, మిట్టపల్లె మాధవరం పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటల నుంచి 7.50 వరకు ఈవీఎంలు మొరాయించాయి. సాయంత్రం 6 గంటల వరకు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను దిశ డీఎస్పీ రమాకాంత్ పరిశీలించారు. ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు పాల్గొన్నారు.

**ఒంటిమిట్ట :** మండల వ్యాప్తంగా ఉదయం 7గంటల నుండి పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం కొండమాచుపల్లి, సాలాబాదు పోలింగ్ బూత్‌లో కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించాయి. మండలంలోని సాలాబాదు, రాచగుడిపల్లె, నరవకాటిపల్లె గ్రామాల్లో వైసీపీ నాయకులు దొంగ ఓట్లను వేసేందుకు ప్రయత్నించారు. పోలింగ్ సరళిని రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం పరిశీలించారు.. వైసీపీ దౌర్జన్యాలను అడ్డుకోవాలని స్థానిక అధికారులకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి శ్రీనివాసులు, కరెంటు రమణ, గజ్జల నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## సాయంత్రం ఆరైనా కొనసాగిన పోలింగ్

చిట్వేలి, మే 13: చిట్వేలి మండలంలోని. రాజుకుంట, వెంకటరాజుపల్లి, సి.కందులవారి పల్లె పోలింగ్ బూత్‌లలో సాయంత్రం ఆరు తరువాత కూడా పోలింగ్ సాగింది. సి.కందులవారిపల్లెలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. 15 నిమిషాల పాటు పోలింగ్ ప్రక్రియ నిలిపివేశారు. నాగవరం బూత్‌లలో బీజేపీ ఏజెంట్‌పై వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈ ఘటనలో బీజేపీ ఏజెంట్ నాగార్జునరెడ్డికి గాయాలయ్యాయి. ఈ విషయమై బీజేపీ ఇన్‌చార్జి చంగల్‌రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కె.కె.చౌదరి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిగిలిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సాఫీగా సాగింది.

## సంబేపల్లె మండలంలో 81 శాతం పోలింగ్

సంబేపల్లె, మే 13: మండలంలో 81 శాతం పోలింగ్ నమోదు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఐదు పోలింగ్ కేంద్రాల్లో సమయం గడిచినా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ కాస్త ం ఆలస్యంగా మొదలైంది. పెద్దబిడికి గుదియవాండ్లపల్లె, వట్టంవాండ్లపల్లె, సదిపిరివాండ్లపల్లె, గురిగింజకుంటదిన్నెపల్లెల్లో మందకొడిగా సాగడంతో ఈ ఐదు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

**లక్కిరెడ్డిపల్లె:** మండలంలో 26,755 మంది ఓటర్లుండగా, 24 వేలకు పైగా ఓట్లు పోల్ అయినట్లు అధికారులు తెలిపారు. .లక్కిరెడ్డిపల్లె టౌన్‌లో 15.16,18 బూతుల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది.



యువకుడిని ఓటువేయడానికి తీసుకెళుతున్న పోలీసులు

**నందలూరు:** మండలంలో 73 శాతం పోలింగ్ నమోదైంది. గొల్లపల్లెలో ఏర్పాటు చేసిన 96 బూత్‌లలో ఈవీఎం మొరాయించడంతో రెండున్నర గంటల పాటు అరవపల్లె క్రీడా మైదానంలోని 94 బూతుల్లోనూ ఈవీఎం మొరాయించడంతో గంటపాటు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమవ్వడంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. అరవపల్లెలో సర్పంచ్ జంబు సూర్యనారాయణపై వైసీపీ ఏజెంటు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, పల్లె శివ శంకర్‌రెడ్డిలు దాడికి ప్రయత్నించగా ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ బూతు వద్ద టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను తరిమివేశారు. మండలంలోని ఆడపూరు 89 పోలింగ్ బూతులోనూ, ఇసుకపల్లి 104 బూతులోనూ రాత్రి 8.30గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

## రాజంపేటలో టీడీపీ విజయం తథ్యం



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఒంటిమిట్ట, 13: రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం విజయం తథ్యమని టీడీపీ సీనియర్ నాయకులు మోదుగుల పెంచలయ్య, కొమరా వెంకట నరసయ్య, పామూరు సుబ్రమణ్యం అన్నారు. వైసీపీ పతనం ప్రారంభమైందని జూన్ 4న టీడీపీ ప్రభుత్వం ఏర్పడటం తథ్యమన్నారు. రాజంపేట ఆరు మండలాల్లో టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యంకు మెజారిటీ వస్తుందని, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి రాజంపేట నియోజకవర్గంలో మెజారిటీ రావడం ఖాయమన్నారు. ఇరువురు అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుస్తారన్నారు. వైసీపీ అరాచక పాలనలో యువత, నిరు ద్యోగులు, వ్యాపారులు, కాలేజీ యాజమాన్యాలు విద్యార్థు లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని, వీరందరికీ త్వరలోనే న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోదుగుల హరి, వెంకటేష్ పాల్గొన్నారు.

## పోలింగ్‌ను పరిశీలించిన సుగవాసి ప్రసాద్‌బాబు



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు

సుండుపల్లె, మే 13: సుండుపల్లె మండలంలోని మడితాడు, రాయవరం, పొలి మేరపల్లె గ్రామ పంచాయతీల్లో ఎన్ని కల సరళిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పరిశీలిరారు. స్థానికులతో మాట్లాడుతూ ప్రతి ఓటరు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకుంటేనే ప్రజా స్వామ్య విలువలను కాపాడగలమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు యూనియన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఓటేసిన కలెక్టర్, జేసీ





ఓటేస్తున్న కలెక్టర్ షన్మోహన్ - ఓటేసేందుకు క్యూలో నిలుచున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 13: జిల్లా ఉన్నతాధికారులు సోమవారం తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ మధ్యాహ్నం కలెక్టర్ బంగ్లా పక్కనున్న బాపు బాలభవన్‌లోని 44వ పోలింగ్ స్టేషన్‌లో క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొంగారెడ్డిపల్లిలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలోని 50వ పోలింగ్ కేంద్రంలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు క్యూలో నిలబడి ఓటేశారు.

## కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్, మే 13: కలెక్టరేట్‌లోని కొత్త స్పందన హాలులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ పరిశీలించారు. ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి ఉదయం 7 గంటల వరకు మాక్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈవీఎంలు మొరాయించిన చోట వెంటనే సరిచేసి పోలింగ్ ప్రక్రియకు ఇబ్బంది లేకుండా చేశారు. వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలించారు. సాధారణ పరిశీలకులు షాదిక్ అలామ్, కైలాష్ వాంఖ్డే, పోలీసు అబ్జర్వర్ అరవింద సాల్వే, చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ వ్యయ పరిశీలకుడు శంకర్ ప్రసాద్ శర్మ వారి వెంట ఉన్నారు.

## సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

చిత్తూరు, మే 13: ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో డీఎస్పీ స్థాయి అధికారులతో పటిష్ట భ ద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పరిష్కరించే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 7 గంటలకు ఆయన పూతలపట్టు నియోజకవర్గంలోని అగ్రహారం బూత్‌ను సందర్శించారు. ఓటర్లతోపాటు వృద్ధులు, బాలింతలు, మహిళలు స్వేచ్ఛగా ఓటు వేసేలా పోలీసు శాఖ తరఫున చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్పీతోపాటు జిల్లా స్పెషలాఫీసర్ ఈశ్వరరావు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

## రిజర్వు ఉద్యోగులకు డ్యూటీ ఇవ్వని ఈఆర్వో



పుంగనూరు స్త్రీశక్తి భవన్‌లో వేచి ఉన్న రిజర్వు పోలింగ్ సిబ్బంది

పుంగనూరు రూరల్, మే 13: సౌకర్యాలు కల్పించకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇబ్బంది పెట్టారని పుంగనూరు నియోజకవర్గంలో పోలింగ్ విధులకు వచ్చిన రిజర్వు ఉద్యోగులు ఆరోపించారు. ఆదివారం తెల్లవారుజామున చిత్తూరు, కుప్పం, నగరి, పూతలపట్టు తదితర నియోజకవర్గాల నుంచి రిజర్వు పోలింగ్ విధులకు 150 మంది వచ్చారు. శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో వేచి ఉండగా మధ్యాహ్నం భోజనం పెట్టి, తర్వాత వారి గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయమై ఈఆర్వో మధుసూదన్‌రెడ్డితో మాట్లాడగా ఎక్కడైనా బంధువుల ఇళ్లలో ఉండాలని, తాము పిలిచిన 15 నిమిషాల్లో ఇక్కడకు చేరుకోవాలని చెప్పడంతో వారు అవాక్కయ్యారు. దీంతో రాత్రి భోజనం, వసతి లేక మహిళా ఉద్యోగులు అవస్థలు పడ్డారు. కొందరు వెనక్కు వెళ్లిపోయారు. సోమవారం వెళ్లి తమకు డ్యూటీ కేటాయించకపోతే అలెవెన్స్ ఇస్తే వెళ్లిపోతామని అడగ్గా బుధవారం రావాలని చెప్పడంతో ఏమి చేయాలో వారికి పాలుపోలేదు. ఈ విషయమై ఈఆర్వో మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా ఆదివారం రాత్రే పుంగనూరు నుంచి ఆర్టీసీ బస్సులో నగరికి ఉద్యోగులను పంపామని, మిగిలిన వారికి అలెవెన్స్ బుధవారం ఇస్తామని చెప్పామని అన్నారు.



చౌడేపల్లె మండలం కాగతిలో సోమవారం రాత్రి 8 గంటలకూ ఓటేసేందుకు వేచియున్న ఓటర్లు



విజయపురం మండలం కేవీపురంలో సాయంత్రం 6 గంటలకు బారులు తీరిన ఓటర్లు



కుప్పం మండలం మంకలదొడ్డి 222 బూత్ వద్ద అస్తవ్యస్త క్యూలైన్లతో ఓటర్ల ఇబ్బందులు





పోలింగ్ సమయం పూర్తవడంతో క్యూలో ఉన్నవారికి టోకెన్లు జారీచేస్తున్న అధికారులు - రాత్రి 7 గంటలకు గేట్లు దూకి లోనికి ప్రవేశిస్తున్న వైసీపీ మద్దతుదారులు



కీలపట్ల 99వ బూత్ వద్ద ఓటు వేయడానికి గుమిగూడిన ఓటర్లు

# సమయం మించినా..

### క్యూలోకి వచ్చిన వైసీపీ నేతలు

### అడ్డుకున్న అధికారులపై తిరగబడిన వైనం

**కీలపట్ల, గుండుగల్లు, గంగవరం, కొత్తపల్లెల్లో రాత్రి 8, 9 గంటల వరకు ఓటింగ్**

గంగవరం, మే 13 : సమయం మించిపోయినా వైసీపీ నేతలు క్యూలోకి ప్రవేశించడమేగాక అడ్డుకున్న అధికారులపై తిరగబ డడం చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ సమయం 6 గంటలకు పూర్తయిన వెంటనే గంగవరం, గుండుగల్లు, కొత్తపల్లె, కీలపట్ల బూత్‌లలో క్యూలో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు పంపిణీ చేసి, గేట్లకు తాళాలు వేశారు. కీలపట్లలో స్లిప్లు ఇచ్చిన వారు ఓటువేసి, అదే స్లిప్పులను గేటుబయట ఉన్న వారికి అందించారు. వారు తమ వద్ద స్లిప్పులు ఉన్నాయని, మమ్మల్ని ఎందుకు లోనికి అనుమతించరని పోలీసు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తాళం తీసే ప్రసక్తే లేదని పోలీసులు తెగేసి చెప్పారు. ఇంతలో కొంతమంది వైసీపీ చోటా లీడర్లు స్లిప్పులున్న వారి అనుచరులను గేట్లు, గోడలు దాటించి లోనికి పంపించారు. పోలింగ్ సిబ్బంది గమనించి వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా తిరగబడి హంగామా సృష్టించారు. దీంతో అధికారులు సైతం మిన్నకుండిపోయారు. కాగా, ఈవీఎంల పనితీరు మందకొడిగా ఉండడంతో మండలంలోని గుండుగల్లు, గంగవరం, కొత్తపల్లెలలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. కీలపట్లలో మాత్రం రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. దండపల్లెలో అర్ధ గంట పాటు ఈవీఎం మొరాయించినా టెక్నికల్ సిబ్బంది సరిజేయడంతో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. గుండుగల్లులో వైసీపీ నాయకులు దొంగ ఓట్లు వేయించడానికి ప్రయత్నిస్తున్నారని టీడీపీ ఆరోపించడంతో వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. పోలీసులు శాంతింపజేశారు. దండపల్లె బూత్ ఎదుట వైసీపీ నాయకులు ఫ్యాన్‌కు ఓటేయాలని బలవంతం చేయగా, టీడీపీ నాయకులు అడ్డుకోగా స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. గంగవరం, మబ్బువాళ్లపేట, మారెడుపల్లె, దండపల్లె లతోపాటు పలు కేంద్రాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కీలపట్లలో పోలింగ్ బూత్‌లను కుదించేయడంతో రాత్రి 9 గంటల వరకు ఓటర్లు బారులు తీరారు. ఓటు వేయడానికి 3 నుంచి 4 గంటలు పట్టడంతో ఓటర్లు తిరగబడ్డారు.

# దొంగ ఓట్లను అడ్డుకున్నారని..

### టీడీపీ నేతలపై వైసీపీ శ్రేణుల దాడి

పుంగనూరు, మే 13: దొంగ ఓట్లను అడ్డుకున్నారనే కోపంతో పోలింగ్ అనంతరం తెలుగుదేశం పార్టీ నేతలపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయి. ఎంపీడీవో కార్యాలయం, తాటిమాకులపాళ్యం పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ ఏజెంట్లు దొంగ ఓట్లకు అనుమతించకపోవడంతో వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. వైసీపీకి ఓట్లు వేయాలని కౌన్సిలర్ నటరాజ ప్రచారం చేస్తుండటంతో టీడీపీ మాజీ కౌన్సిలర్ దేశాది ప్రకాశ్ అడుకున్నారు. వీరి మధ్య గొడవ జరిగింది. తాటిమాకులపాళ్యం పోలింగ్ కేంద్రంలో ప్రకాశ్ ఓటు వేయడానికి వెళ్లగా వైసీపీ శ్రేణులు దుర్భాషలాడాయి. అదే సమయంలో తన ఓటు అడ్డుకున్నారని వైసీపీకి చెందిన బండ కుమార్ గొడవకు దిగారు. పోలింగ్ అనంతరం వారి వారి ఇళ్లకు వెళ్లారు. ఈ క్రమంలో తాటిమాకులపాళ్యంలో దేశాది ప్రకాశ్ ఇంటిపై వైసీపీ కౌన్సిలర్ నటరాజ, పార్టీ కార్యకర్తలు బండ కుమార్, సాగర్, సునీల్ తదితరులు రాళ్లు, కర్రలతో ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ దాడి చేయడానికి ప్రయత్నించారు. దేశాది ప్రకాశ్ ఫిర్యాదు చేయడంతో ఏఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అక్కడ నుంచి పంపించేశారు. అలాగే స్థానిక కొత్తయిండ్లు పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు అనుమతించలేదని టీడీపీ ఏజెంట్లు నరేశ్‌రాయల్, రమేశ్‌లను కొట్టాలని అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రం వద్దకు వైసీపీ శ్రేణులు వచ్చాయి. దీంతో పోలింగ్ ముగిసినా వారు పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడే ఉన్నారు. ఈ క్రమంలో నరేశ్‌రాయల్, రమేశ్‌లను ఏఎస్పీ సుబ్బరాజు తన వాహనంలో ఇళ్లకు పంపారు.

## బెడిసికొట్టిన వైసీపీ వ్యూహం

### బైండోవర్ కేసులు పెట్టినా ఈసీ నిర్ణయంతో ఏజెంట్లుగా ప్రతిపక్ష నేతలు

పుంగనూరు, మే 13: పుంగనూరు నియోజకవర్గంలో పోలీసుల సాయంతో వైసీపీ పన్నిన వ్యూహం బెడిసికొట్టింది. ప్రత్యర్థులపై రౌడీషీట్లు తెరిచి, పోలింగ్ ఏజెంట్లుగా అవకాశంలేకుండా చేయాలన్న ఆలోచన ఫలితం ఇవ్వలేదు. గత ఏడాది ఆగస్టు నాలుగో తేదీ పుంగనూరు శివార్లలోని భీమగానిపల్లె వద్ద కృష్ణదేవరాయల విగ్రహం వద్ద టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన సందర్భంగా గొడవ జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలీసులే ఫిర్యాదుదారులుగా టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డితోపాటు 498 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అదే సమయంలో రౌడీషీట్ అస్త్రాన్ని ప్రయోగించారు. మూడు కేసులున్న దాదాపు 100 మంది టీడీపీ నేతలపై రౌడీషీట్లు తెరిచారు. కానీ ఎన్నికల సంఘం నిబంధనలతో టీడీపీ శ్రేణులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా టీడీపీ అభ్యర్థి సంతకంతో ఉన్న పత్రాన్ని తీసుకుని ఏజెంటుగా కూర్చున్నారు.

## కలకలం రేపిన వీవీప్యాట్‌లోని చిత్రం

### సోషల్ మీడియాలో హల్‌చల్



పలమనేరు, మే13 : పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకునే వారు మాత్రమే చూడగలిగే వీవీప్యాట్‌లో ఓటు వేసిన చిత్రం సోమవారం పలమనేరులో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. వీవీప్యాట్‌లో ఓటు అమరనాథరెడ్డికి పోల్ చేసినట్లు సైకిల్ గుర్తుతోపాటు గ్రూప్ అడ్మిన్ మోహన్ సోషియల్ మీడియాలో పోస్టు చేశారు. సెల్‌ఫోన్లు పోలింగ్ కేంద్రంలోకి అనుమతి లేని సమయంలో ఈ చిత్రం బయటకు ఎలా వచ్చిందనేది పెద్ద చర్చనీయాంశంగా మారింది. పలమనేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి మనోజ్‌రెడ్డిని వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## మద్యం తాగి ఒకరి మృతి



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

కార్వేటినగరం, మే 13: మద్యం తాగి కార్వేటినగరం పంచాయతీ ఆదిఆంధ్రవాడకు చెందిన వెంకటేష్(63) ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం ఎన్నికల పోలింగ్ కావడంతో ప్రధాన పార్టీల నాయకులు రాత్రి మద్యం పంపిణీ చేశారు. పరిమితికి మించి తాగడంతో మృతిచెందినట్లు కాలనీవాసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు చనిపోవడంతో దిక్కులేని వారయ్యారు.

## కర్ణాటక మద్యం పట్టివేత : ఇద్దరి అరెస్ట్



కార్వేటినగరం, మే 13: కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచ్చికాపలం వద్ద రూ.54 వేల విలువైన కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు స్పెష ల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి లక్ష్మీదుర్గయ్య తెలిపారు. వెదురుకుప్పం మండలం తెల్లగుండ్లపల్లి గ్రామానికి చెందిన చొక్కా ప్రతాప్ నుంచి 26 బాటిళ్లు, గోవిందవారిపల్లెకు చెందిన మల్లికార్జున నుంచి 32 కర్ణాటక మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ రిమాండుకు తరలించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు నాగరాజు, భారతి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి



మృతిచెందిన గోవిందయ్య

శ్రీరంగరాజపురం, మే 13: రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గోవిందస్వామి (70) రోడ్లపై చెత్త ఏరుకుంటూ, ఇంటింటికీ వెళ్లి యాచించి పొట్టపోసుకునేవాడు. ఎస్ఆర్‌పురం మండలం కనికపురం గ్రామ సమీపంలో రోడ్డుపై చెత్త ఏరుకుంటుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# అదనపు బలగాలెక్కడ?

- నాలుగు కేంద్రాలకూ ఒక్కరే కానిస్టేబుల్
- ఘర్షణల నియంత్రణలో పోలీసుల వైఫల్యం

చిత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1,500 మందికిపైగా పోలీసు సిబ్బంది ఉండగా, మరో 1,500 మందికిపైగా అదనపు బలగాలను తెప్పించినట్లు పోలీసు అధికారులు చెప్పారు. 3 వేల మందికిపైగా పోలీసులతో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అయితే జిల్లాలోని చాలా పోలింగ్ ప్రాంతాల్లో ఒకరే కానిస్టేబుల్ కనిపించారు. దీంతో ఘర్షణలను నిలువరించలేకపోయారు. ఎస్‌టీఎఫ్ బలగాలు వచ్చే సరికి జరగాల్సిన ప్రమాదం జరిగిపోయింది. చిత్తూరు నగరం మంగసముద్రంలో టీడీపీ శ్రేణులను వైసీపీ నాయకులు కొట్టాక బలగాలు వచ్చి చెదరగొట్టాయి. షర్మన్ వద్ద టీడీపీ అభ్యర్థి గురజాల వాహనానికి అడ్డుగా 10 నిమిషాలపాటు వైసీపీ నేత పురుషోత్తంరెడ్డి తన వాహనాన్ని అడ్డుపెట్టారు. అక్కడా పోలీసులు కనిపించలేదు. యాదమరి మండలం ముస్లింవాడలో దొంగ ఓట్లు వేసుకుంటున్న వైసీపీ వాళ్లను టీడీపీ శ్రేణులు అడ్డుకోగా కత్తులతో దాడి చేశారు. అక్కడా ఒక్కరే కానిస్టేబుల్ ఉండడంతో అడ్డుకోలేకపోయారు. అదే మండలం కాశిరాల, కోడిగుట్ట కేంద్రాల్లో వైసీపీ వాళ్లు ఓటర్లను బెదిరించి, కేంద్రాల్లోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అక్కడా ఒక్కడే కానిస్టేబుల్ ఉండడంతో వైసీపీ వాళ్లను నిలువరించలేకపోయారు. జీడీనెల్లూరు మండలం బాలగంగనపల్లె కేంద్రం వద్ద ఇరు పార్టీ వర్గాలు గుంపులుగా చేరుకుని వాగ్వాదం చేసుకున్నారు. ఇక్కడున్న కానిస్టేబుల్ నిలువరించలేక విఫలమయ్యారు. ఇలా ప్రతిచోటా పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది.





చిత్తూరులోని జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్‌లో వేచివున్న ఓటర్లు

# మొరాయించిన ఈవీఎంలు

- పలుచోట్ల ఆలస్యంగా పోలింగ్

చిత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఐరాల మండలంలోని పుత్రమద్ది, తవణంపల్లెలోని పుణ్యసముద్రం కేంద్రాలు, నింద్ర మండలం 184 కేంద్రం, కుప్పంలోని 168, 132, 197 కేంద్రాలు, వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు, మాంబేడు, కార్వేటినగరంలోని 91 కేంద్రం, గుడిపాల మండలం పేయినపల్లె, వి.కోట మండలం 170, 171 కేంద్రాలు, కార్వేటినగరం మండలం 103 కేంద్రం, పాలసముద్రం మండలం శ్రీబొమ్మరాజుపురం, వి.కోట మండలం 196 కేంద్రం, శాంతిపురం మండలం శివరాంపురం, జీడీనెల్లూరు మండలం పాతవెంకటాపురం, చౌడేపల్లె మండలం 106, 107 తదితర కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ఆలస్యంగా పోలింగ్ మొదలవడంతో చాలా కేంద్రాల్లో రాత్రి 10 గంటలకు కూడా ఓటర్లు క్యూలో ఉన్నారు. వి.కోట మండలం జొన్నపల్లె కేంద్రంలో, బంగారుపాళ్యం మండలం తంబుగానిపల్లెలో సుమారు 300 మంది రాత్రి క్యూలో ఉన్నారు. వి.కోట మండలంలో సుమారు 8 కేంద్రాల్లో, చౌడేపల్లె మండలంలోని ఐదు కేంద్రాల్లో, పులిచెర్ల మండలం మతుకువారిపల్లెలో, బంగారుపాళ్యంలోని కచ్చేటివారిపల్లెలో, గంగవరం మండలం కీళ్లపట్ల, కొత్తపల్లె, గంగవరం కేంద్రాల్లో, సోమల మండలం పొదలగుంటపల్లె, టీ.గొల్లపల్లె, పూతలపట్టు మండలం గొడుగుచింతలో రాత్రి 10 గంటలు దాటినా పోలింగ్ కొనసాగింది.







# స్ట్రాంగ్ రూములకు చేరుకుంటున్న ఈవీఎంలు

చిత్తూరు కలెక్టరేట్, మే 13 : సార్వత్రిక ఎన్నికల పోటీలోని అభ్యర్థుల భవితవ్యం తేల్చే ఈవీఎం మిషన్లు సోమవారం రాత్రి 10 గంటల నుంచి చిత్తూరులోని ఎస్ వి సెట్ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకుంటున్నాయి ఇక్కడ 10 రిసీవింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీవో డెయిరీలతో పాటు ఎన్నికల్లో వాడిన పోలింగ్ సామగ్రిని అధికారులు అందజేస్తున్నారు. తొలుత చిత్తూరు అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు చేరుకున్నాయి. జిల్లాలో మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు గట్టి పోలీసు బందోబస్తు నడుమ తరలిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో తరలించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్, జేసీ సమక్షంలో అర్ధరాత్రి నుంచి నియోజకవర్గాల వారీగా వాటిని భద్రపరుస్తారు.

# వివాదాలు.. గొడవలు

ఆంధ్రజ్యోతి, చిత్తూరు: జిల్లాలో సోమవారం పోలింగ్ సందర్భంగా పలు కేంద్రాల్లో వివాదాలు, గొడవలు చోటుచేసుకున్నాయి.

**డిజిటల్ అసిస్టెంట్‌పై జనాగ్రహం**



వి.కోట మండలం కుంబార్లపల్లె కేంద్రంలో ఓటరు స్లిప్పుల్ని పంపిణీ చేయకుండా ఉంచుకున్నందుకు డిజిటల్ అసిస్టెంట్ మీద ఓటర్లు ఆగ్రహించారు. వైసీపీ స్లిప్పుల్ని పంపిణీ చేసి, మిగిలినవి అందించలేదని నిలదీశారు.

**నమూనా ఈవీఎంతో..**



వి.కోట మండలం తోటకనుమ పోలింగ్ కేంద్రం పక్కనే మోడల్ బ్యాలెట్‌తో వైసీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. దీనిపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. వి.కోటలోని బాలికోన్నత పాఠశాలలో సాయంత్రం ఆరు దాటినా ఓటు వేసేందుకు వచ్చిన వారిని అనుమతించాలనడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది.

- చౌడేపల్లె మండలం చారాల 119, 120 కేంద్రాల్లో ముగ్గురు వలంటీర్లు ఏజెంట్లుగా కూర్చున్నారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ- వైసీపీ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వలంటీర్లను కేంద్రం నుంచి పీవో పంపించేశారు.
- నగరి పట్టణంలోని కొత్తపేట తమిళ ఉన్నత పాఠశాల వద్ద వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వాగ్వాదాం చోటు చేసుకోగా, పోలీసులు తరిమికొట్టారు.
- యాదమరి మండలం కాశిరాల, కోడిగుట్ట కేంద్రాల్లో వైసీపీ వాళ్లు ఓటర్లను బెదిరించి, కేంద్రాల్లోకి రాకుండా అడ్డుకున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. అక్కడ ఒకరే కానిస్టేబుల్ ఉండడంతో నిలువరించలేకపోయారని ఫిర్యాదు చేశారు.
- చిత్తూరు నగరం 24, 27 పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ కార్పొరేటర్ హరిణిరెడ్డి ఓటర్లకు బహిరంగంగా డబ్బులు పంపిణీ చేసినా పోలీసులు పట్టించుకోలేదని టీడీపీ నాయకులు ఆరోపించారు.
- పూతలపట్టు మండలం సంజీవరాయునిపల్లె పోలింగ్ కేంద్రంలో వైసీపీ నేతలు ఓటర్ల నుంచి స్లిప్పుల్ని లాక్కుని దొంగ ఓట్లు వేసే ప్రయత్నాన్ని టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ అడ్డుకున్నారు.

## 'స్టేటస్'లో మాక్‌పోలింగ్ ఫొటో

- వైసీపీ సర్పంచిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రామకుప్పం, మే 13: రామకుప్పం మండలం ముద్దనపల్లె పోలింగ్ బూత్‌లో మాక్ పోలింగ్ ఫొటోను తీసి వైసీపీకి చెందిన సర్పంచు సికిందర్ తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టారు. వాట్సాస్ స్టేటస్‌ను స్థానికులు స్క్రీన్‌షాట్ తీసి పోలీసులకు పంపారు. దీనిపై స్పందించిన పోలీసులు సికిందర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

# పోలింగ్ ప్రశాంతం

**● పీలేరులో 79.02, తంబళ్లపల్లెలో 80.09. మదనపల్లెలో 73.07 శాతం పోలింగ్ ● వేసవి ఎండకు ఇబ్బందులు పడ్డ ఓటర్లు**

మదనపల్లె/టౌన్, మే 13: మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, ఆరు గంటల నుంచే ఓటర్లు క్యూ లైన్లలో వేచి ఉన్నారు. మధ్యాహ్నం ఎండ, వేడిమి నేపథ్యంలో ఉదయాన్నే తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ఆత్రుతతో ఓటర్లు బారులు తీరారు. ముఖ్యంగా మదనపల్లె మున్సిపాలిటీ, బి.కొత్తకోట నగర పంచాయతీ కేంద్రం, ములకలచెరువు మండల కేంద్రంలో ఓటర్లు మొదటే ఎక్కువగా క్యూలో కనిపించారు. ఈ క్రమంలో కొన్ని చోట్ల మొదట్లోనే ఈవీఎంలు మొరాయించగా, మరికొన్ని చోట్ల కొంతసేపు పనిచేసిన తర్వాత పనిచేయకుండా మొండికేశాయి. అక్కడున్న పోలింగ్ అధికారులు, సిబ్బంది ఆర్వో దృష్టికి తీసుకెళ్లగా, అందుబాటులోని సాంకేతిక సిబ్బంది వెళ్లి వాటిని సరిచేయగా, మరికొన్ని చోట్ల ఈవీఎంలనే మార్పు చేశారు. దీంతో కేంద్రాన్ని బట్టి అరగంట నుంచి సుమారు గంటపాటు ఓటర్లు క్యూలో నిరీక్షించాల్సి వచ్చింది. ఇందులో రామిరెడ్డిలేఅవుట్‌లోని వివేకానందస్కూల్, బీటీకళాశాల కేంద్రంలో మొరాయించిన వాటిలో ఉన్నాయి. ఇదిలావుండగా, ఉదయం నుంచి బారులు తీరిన ఓటర్లు మధ్యాహ్నం 12:30గంటలకు కానీ తగ్గలేదు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2గంటల వరకూ ఓటర్లు మరోసారి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. ఆ తర్వాత ఎండ ఎక్కువ కావడంతో ఉన్న ఓటర్లు పోలింగ్ కేంద్రానికే పరిమితం కాగా, మిగిలిన వారు రాలేదు. ఎండ తగ్గాక, సాయంత్రం 4గంటలకు మళ్లీ ఊపందుకుంది. పట్టణంలోని సీఎస్ఐస్కూల్, బాలికల ఉన్నత పాఠశాలలో మూడు కేంద్రాలతోపాటు మదనపల్లె, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, ముకలచెరువు మండలాల్లో మరికొన్ని కేంద్రాలు ఓటర్లు లేక ఖాళీగా దర్శనమిచ్చాయి. అలాగే ఓట్లు ఎక్కువగా ఉన్న మరికొన్ని కేంద్రాలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూడా ఓటర్లతో క్యూలైన్లు చాంతాడంత పొడవు కనిపించాయి. సాయంత్రం గడువు ముగిసేలోగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

### పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం చేస్తున్నారని ఘర్షణ

మదనపల్లెలోని పెంచుపాడు రోడ్డులోని రవీంద్రనాథ్‌స్కూల్‌లో 15, 16వార్డులకు సంబంధించిన ఓటర్లకు పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఈ క్రమంలో ఉదయం 11గంటల ప్రాంతంలో టీడీపీ నాయకుడు రాటకొండ మధు బాబు ఓటు హక్కు వినియోగించుకునే క్రమంలో పార్టీ కండువాతో వచ్చారని వైసీపీ నాయకులు వాదనకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదనలు, తోపు లాటలు జరిగాయి. ఈ క్రమంలో ఒకరిపై మరొక రు పిడుగుద్దులు గుద్దుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అనంతరం అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇదే విధంగా స్థానిక హోప్‌హైస్కూల్, మదనపల్లె మండలం కొత్తపల్లె, వలసపల్లె పోలింగ్ కేంద్రాల వద్ద రెండుపార్టీల నాయకుల మధ్య వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి.



మదనపల్లె మండలం వలసపల్లె పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ఒకేసారి చొచ్చుకుని వెళుతున్న ఓటర్లు



గుర్రంకొండలో ఉదయం 7 గంటలకు క్యూలో ఉన్న ఓటర్లు



కలికిరి చదివేవాండ్లపల్లె బూత్ వద్ద ఉదయమే బారులు తీరిన ఓటర్లు



పీలేరులో ఓటర్లకు అభివాదం చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

### పోలింగ్ సరళిని పరిశీలించిన నల్లారి కిరణ్

మదనపల్లె పట్టణంలో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ సరళిని రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి అక్కడి అధికారులను పోలింగ్ సరళిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యూలో వున్న కొంత మంది ఓటర్లు కిరణ్‌ను ఆప్యాయంగా పలకరించారు. ఆయన వెంట బీజేపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్ వున్నారు.

### పోలింగ్ కేంద్రాల వద్ద అంతంత మాత్రమే పోలీసు బందోబస్తు

మదనపల్లె నియోజకవర్గంలో 259 పోలింగ్ కేంద్రాలు ఉండగా పలు చోట్ల అంతంత మాత్రంగానే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మదనపల్లె మండలంలో పలు ఒక్కో స్కూల్లో ఐదు, ఆరు పోలింగ్ కేంద్రాలు వున్నా అక్కడ కేవలం ఒకరు, లేదా ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లను మాత్రమే వుంచారు. పలు కేంద్రాల వద్ద తమిళనాడు, కర్ణాటక నుంచి వచ్చి హోమ్ గార్డులను వుంచారు. వలసపల్లె గ్రామం పోలింగ్ కేంద్రం వద్ద ఎన్‌సీసీ క్యాడెట్‌ను వుంచడంతో అక్కడి ఓటర్లను అడ్డుకోలేకపోయారు. దీంతో బ్యారికేడ్లు, క్యూ కాదని ఒక్కసారిగా ఓటర్లు లోనికి జొరపడడంతో పోలింగ్ అధికారులు కొద్దిసేపు పోలింగ్ ఆపి వేయాల్సి వచ్చింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం కావాల్సి వుండగా, మాక్ పోలింగ్, మాక్ ఓట్ల లెక్కింపు, ఈవీఎంలకు సీల్ వేయ డంలో ఆలస్యం కావడంతో ఉదయం 7.30 గంటల తరువాత పోలింగ్ ప్రారంభించారు.

### ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు

మదనపల్లె పట్టణంలో పలువురు ప్రముఖులు తమ కుటుంబసభ్యులతో వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. మదనపల్లె రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ సతీమణితో పాటు సీఎస్ఐ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అలాగే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని పోలింగ్ కేంద్రలో ఓటు వేశారు. వైసీపీ అభ్యర్థి నిస్సార్‌అహ్మద్ తన కుటుంబంతో వచ్చి ఓటు వేశారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి, డాక్టర్ శైలజదేశాయ్ ఇద్దరు కుమార్తెలతో వచ్చి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓట్లు వేశారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ కృష్ణానగర్‌లో, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి తట్టివారిపల్లె పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు నీరుగట్టువారిపల్లెలో, టీడీపీ సీనియర్‌నేత, సమన్వయకర్త మార్పురి సుధాకర్‌నాయుడు బీటీ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. మదనపల్లె నియోజకవర్గంలో ఉదయం నుంచి మందకొడిగానే పోలింగ్ జరిగింది. సాయంత్రం 6గంటలు ముగిసే సమయానికి 67.23శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. ఉదయం 9గంటలకు 10.8శాతం, 11 గంటలకు 24.05శాతం, మధ్యాహ్నం ఒంటిగంటకు 35.2శాతం మాత్రమే పోలింగ్ అయింది. తరువాత రెండు గంటల్లో పోలింగ్ పుంజుకుని మధ్యాహ్నం 3గంటలకు 53.1శాతం చేరింది. తరువాత ఒక్కసారిగా పోలింగ్‌శాతం పడిపోయింది. సాయంత్రం 6గంటలకు 67.23శాతం ఓట్లు పోలయ్యాయి. కాగా రాత్రి 8 గంటల తర్వాత 73.07 శాతం పోలింగ్ జరగడమేకాకుండా ఇంకా వేటువేయడానికి వచ్చిన వారు క్యూలో ఉండడంతో పోలింగ్ శాతం ఇంకా పెరిగే అవకాశం ఉంది.

### తొలిసారి ఓటు వేయడంలో యువత ఉత్సాహం

నూతనంగా ఓటుహక్కు పొందిన యువత ఈ సారి ఓటు వేయడంలో ఉత్సాహం చూపించారు. 18 ఏళ్లు నిండిన యువత ఎండలో సైతం పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడం కనిపించింది. అంతే కాకుండా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాలు నుంచే కాక హుబ్లీ తదితర సుదూరప్రాంతాల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డాక్టర్లు శ్రమకోర్చి స్వగ్రామాలకు వచ్చి ఓటు వేశారు. ఈ యువతే రాకుంటే మదనపల్లెలో పోలింగ్‌శాతం ఇంకా తగ్గేది.

**నిమ్మనపల్లిలో:** ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించినట్లు ఏఆర్వో బాలాజిరాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం ఓటర్లు 26069మంది ఉండగా 24 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. అయితే 209 బూత్‌లో ఈవీఎమ్‌లు మొరాయించడంతో గంట పాటు ఓటింగ్‌కు ఆలస్యమైందన్నారు. అలాగే సాయత్రం 6గంటలకు ఓటింగ్ నిర్వహించగా కొన్నిచోట్ల ఓటింగ్ ఆలస్యం కావడంతో క్యూలో వున్న ఓటర్లను ఓటింగ్‌కు అనుమతించారు. ఓటింగ్ పూర్తి అయిన ఈవీఎమ్‌ను కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. కాగా నిమ్మనపల్లె మండలంలో 84.85శాతం పోలింగ్ జరిగింది.

**కురబలకోటలో:** కురబలకోట మండలంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 34,468 మంది ఓటర్లకు గానూ 35 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటలను నుంచి పోలింగ్‌ను ప్రారంభించారు. కాగా తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఎన్నికల అధికారులు ఎంపిక చేయడంతో వెబ్‌కాస్టింగ్ నీడలో నిర్వహించారు. రాజంపేట పార్లమెంటరీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మండలంలోని అంగళ్లు పోలింగ్ కేంద్రాన్ని టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి కురబలకోట, అంగళ్లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. కాగా ఎన్నికలను కేంద్ర, రాష్ట్ర పోలీసుల బలగాలతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

**కలికిరిలో:** మండలంలోని 48 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పారపట్ల, మేడికుర్తి పంచాయతీల్లోని రెండు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో గంటన్నర ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. గతంలో మహిళలకు వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలుండేవి. ప్రస్తుతం అందరికీ కలిపి ఒకే పోలింగ్ కేంద్రం కావడంతో పలు చోట్ల పోలింగ్ పూర్తి కావడానికి రెండు గంటలపాటు అదనంగా సమయం తీసుకుంది. రాత్రి 8 గంటలకు అన్ని చోట్ల పోలింగ్ ముగిసింది. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ సీఆర్పీఎఫ్ పోలీసులను మోహరించారు. వెబ్ క్యాస్టింగ్ నిరంతరాయంగా జరిగింది.

**బి.కొత్తకోటలో:** బి.కొత్తకోట మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా ఉన్న 53 పోలింగ్ బూత్‌లలోనూ ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఒకటి రెండుచోట్ల ఈవీయంలు కాసేపు మొరాయించడంతో కాస్త ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. సీఐ సూర్యనారాయణ పర్యవేక్షణలో సివిల్, సెంట్రల్ రిజర్వ్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 50,231 మంది ఓటర్లు ఉండగా 70శాతానికి పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని వడుగులవాండ్లపల్లెలో ఓ ఓటు విషయమై సమస్య తలెత్తడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మండలంలోని శంకరాపురంపీయస్ నంబర్192, 197 బడికాయలపల్లె, బయప్పగారిపల్లె, వడుగులవాండ్లపల్లె తదితర గ్రామాలలో పోలింగ్ ప్రక్రియ ఆలస్యం కావడం, నిర్ణీత సమయం ముగిసినా ఓటర్లు క్యూలైన్లలో వుండటంతో రాత్రి పొద్దుపోయే వరకు అధికారులు పోలింగ్ కొనసాగించారు. ఎంత ఆలస్యం అయినా వారికి అవకాశం కల్పిస్తామని తహశీల్దార్ పుణ్యవతి పేర్కొన్నారు.

### పీలేరులో పోటెత్తిన ఓటరన్న..!

పీలేరు, మే 13: ప్రచండ భానుడు నిప్పులు కురిపించినా, ఎడతెగని ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసినా, పీలేరు నియోజకవర్గ ప్రజలు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. పోలింగ్ నిర్దేశిత సమయం ఉదయం 7 గంటలైనా సోమవారం ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల ముందు ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు నియోజకవర్గంలోని అధిక శాతం పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం 1 గంటకు 43.07 శాతం, మధ్యాహ్నం 3 గంటలకు 57.25 శాతం, సాయంత్రం 5 గంటలకు 70.03 శాతం, రాత్రి 9 గంటలకు 79.02 శాతం పోలింగ్ జరిగింది. పీలేరు నియోజకవర్గంలో మొత్తం 2,34,608 మంది ఓటర్లు ఉండగా సోమవారం రాత్రి 9 గంటలకు 1,80,839 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని పీలేరు, కేవీపల్లె, కలకడ, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇంకా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూ లైన్‌లలో వేచి ఉన్నారు. పీలేరు మండలం ఎర్రగుంటపల్లె పంచాయతీ దేవళంపల్లె పోలింగ్ కేంద్రంలో వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై కవ్వింపు చర్యలకు దిగడం, పోలింగ్‌ను ఆలస్యం చేయడంతో అక్కడ ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. దేవళంపల్లెలో ఆర్వో ఫర్మాన్ అహ్మద్, పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి పరిస్థితిని సమీక్షించారు.

### పోలింగ్ సరళిని పరిశీలించిన కిశోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు మండలంలో జరుగుతున్న పోలింగ్ సరళిని టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పరిశీలించారు. పట్టణంలోని ఏవీఆర్ పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటపల్లె పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు.

### మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సోమవారం సాయంత్రం సందర్శించారు. మోడల్ పోలింగ్ కేంద్రంలోని మొత్తం ఓట్లు, వాటిలో పోలైన ఓట్ల గురించి స్థానిక రిటర్నింగ్ అధికారి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఇతర పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి ఓటర్లతో మాట్లాడారు. చివరి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించునే వరకు పోలింగ్ సిబ్బంది అందుబాటులో ఉంటారని వారికి తెలిపారు. పీలేరు పట్టణంలోని కోటిపల్లె, ఏఎంసీ ప్రాంగణం, తలపుల గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను కేంద్ర ఎన్నికల పరిశీలకులు(పోలీసు విభాగం), ఐపీ ఎస్ అధికారి దిల్ నవాజ్ అహ్మద్ సోమవారం సందర్శించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తు, పోలింగ్ తీరును స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

### పోలింగ్ ఏజెంట్లుగా మాజీ వలంటీర్లు

సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అధికార పార్టీ రాజీనామాలు చేసిన మాజీ వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా ఉపయోగించుకుంది. పీలేరు మండలంలోని అధిక శాతం పోలింగ్ కేంద్రాల్లో మాజీ వలంటీర్లు పోలింగ్ ఏజెంట్లుగా దర్శనమిచ్చారు.



పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



పీలేరు పట్టణం ఏవీఆర్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో క్యూలో నిలుచుని ఉన్న ఓటర్లు



నిమ్మనపల్లెలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడి ఉన్న ప్రజలు



వాల్మీకిపురంలోని పోలింగ్ కేంద్రాలలో బారులు తీరిన ఓటర్లు

**గుర్రంకొండలో:** గుర్రంకొండ మండలంలోని అన్ని గ్రామాల్లోని 43 పోలింగ్ కేంద్రాల్లో 77 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా సంగసముద్రం పంచాయితీ మామిళ్లవారిపల్లె పోలింగ్ కేంద్రంలో వైసీపీ నాయకులు ఓటు విషయమై టీడీపీ నాయకులతో గొడవపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు అల్లరిమూకలను చెదరగొట్టారు. అలాగే గుర్రంకొండ, గెరికుంటపల్లె, దౌలత్‌ఖాన్‌పల్లెలో ఇరుపార్టీల నాయకుల మధ్య గొడవ జరిగింది. ఎల్లుట్ల, రామాపురం, శెట్టివారిపల్లె పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం మొరాయించడంతో రాత్రి 9 గంటల వరకు క్యూలైన్‌లో ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**కలకడలో:** సార్వత్రిక ఎన్నికలు స్వల్పఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. కొన్ని చోట్ల ఈవీఎం మొరాయించిన నిమిషాల్లోనే పని చేశాయి. నవాబ్‌పేట, రాతిగుంటపల్లె పోలింగ్ బూత్‌లో వృద్ధులకు సహాకులను అనుమతించే విషయంలో టీడీపీ, వైసీపీ వర్గాలు ఘర్షణకు దారితీసే సమయంలో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. నల్లగుట్టపల్లె,కలకడ, కదిరాయచెరువు బూత్‌లో జరుగుతున్న పోలింగ్ సరళిని రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. అలాగే కేదొడ్డిపల్లె ఓటింగ్ కేంద్రాన్ని ఆర్వో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కలకడ మండలం కేదొడ్డిపల్లెకు చెందిన శతాధిక వృద్ధురాలు మంగమ్మ కుమారుడు రమణప్పనాయుడు సాయంతో పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేయడంపై పలువురు ప్రసంశించారు.

**తంబళ్లపల్లెలో:** తంబళ్లపల్లె పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరగా..నూతన ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ పక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. సమయం ముగిసేసరికి క్యూలైన్లలో ఉన్న వారంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. తంబళ్లపల్లె నియోజవర్గంలోని ఆరు మండలాల్లో 2,24,802 మంది ఓటర్లు ఉండగా రాత్రి 8:30 గంటల సమయానికి 1,72,832 మంది ఓటర్లు ఓటు హక్కు వినియో గించుకోగా 80.09 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

**పెద్దమండ్యంలో:** మండలంలో 81 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు.మండలంలోని బండమీదపల్లె గ్రామపంచాయతీ తిరుపల్లీ పోలింగ్ కేంద్రంలో ఇబ్బందులు పడుతున్న వయోవృద్ధుడిని మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి కేంద్ర బలగాలసాయంతో ఒయటకు తీసుకువచ్చారు.



కలకడలో పోలింగ్ బూత్‌ను తనిఖీ చేసిన ఆర్వో ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్



ఓటుహక్కు వినియోగించుకున్న రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్ దంపతులు



మదనపల్లెలో కుటుంబసభ్యులతో వచ్చి ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి





ఓటు హక్కు వినియోగించుకున్న టీడీపీ సమన్వయకర్త మార్పురి సుధాకర్‌నాయుడు, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు

## రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

బి.కొత్తకోట, మే13: రోడ్డు ప్రమాదంలో ఓ బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. దీనికి సంబంధించి సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.... పీటీయం మండలం బూర్లపల్లెకు చెందిన రైతు వెంకట్రమణారెడ్డికి ఒక్కగానొక్క కొడుకు హర్షవర్ధన్. ఇతను మదనపల్లె సమీపం లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. సెలవులో ఇంటికొచ్చి తన సమీప బంధువైన మమత(45)ను ద్విచక్ర వాహనంలో కూర్చోబెట్టుకొని బి.కొత్తకోటకు బయలుదేరి వెళుతుండగా ఆలేటిపల్లె క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఓ ఆటో ఢీకొంది. దీంతో రోడ్డుపై వెల్లకిలా పడిపోయిన అతని తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తర లించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. వెనుక కూర్చున్న మమతకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి మృతితో బూర్లపల్లెలో విషాధచాయలు అలుముకున్నాయి.

## టీడీపీ నాయకుడిపై ఉపసర్పంచ్ దాడి

వాల్మీకిపురం, మే 13: వాల్మీకిపురంలో సోమవారం ఎన్నికల సందర్భం గా చిన్నపాటిపాటి ఘర్షణ చోటుచేసుకుంది. స్థానిక ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు శంకర తాను స్థానిక సంతగేటు సమీపం లో ఉండగా వైసీపీకి చెందిన ఉపసర్పంచ్ కేశవరెడ్డి తనపై దాడి చేశాడని పోలీసులకు ఫిరాదు చేశాడు. ఈసందర్భంగా శంకర మా ట్లాడుతూ తాను ఒక్కడినే ఉండగా వైసీపీకి చెందిన ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, అతని అనుచరులతో వచ్చి తనను బెదిరిస్తూ దాడికి పాల్పడి రక్తగాయాలు చేశారన్నారు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

## కమనీయం.. సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, మే 13: వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా కమనీయంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్ర భాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. నిత్య కైంకర్యాల అనంతరం నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణలు గావించి ఆలయం మండపంలో పుష్పాలంకరణలతో తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ కల్యాణ వేడుకలు కమనీయంగా సాగాయి. చివరగా హోమాధికార్యక్రమాలు గావించి కల్యాణంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం విశేష అలంకరణలతో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిలో పురవీధుల గుండా నగరోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ అధికారులు, కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులతోపాటు ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## పోలింగ్‌లో పదనిసలు

మదనపల్లె, మే 13: మదనపల్లెలో సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో పదనిసలు, ఏర్పాట్లలో వైఫల్యాలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. ఉదయాన్నే ఓటర్లు క్యూలో బారులు తీరగా, తర్వాత ఉన్నవారు ఓటు హక్కు వినియోగించుకోగా, కొన్ని చోట్ల పోలింగ్ కేంద్రాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కొన్నింటిలో మాత్రం ఉదయం నాటి రద్దీనే సాయంత్రం వరకూ కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు తగిస్థాయిలో చేపట్టలేదు. సిబ్బంది కొరత కొట్టొచ్చినట్లు కనిపించింది. ఒక్కో సెంటర్‌లో మూడు, నాలుగు పోలింగ్ కేంద్రాలున్నా..ఇద్దరుమించీ పోలీసులు ఎక్కడా లేరు. కొన్నిచోట్ల అయితే ఎన్‌సీసీ సిబ్బందిని వాలంటీర్లుగా నియమించారు. క్యూ లైన్ల నిర్వహణలో అధికారులు, పోలీసులు విఫలయ్యారు. దీనికి తోడు పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడం, సాంకేతిక సమస్యలతో ఓటింగ్ ఆలస్యం కావడంతో ఓటర్లు ఎక్కువ సేపు క్యూలో నిలబడాల్సి వచ్చింది. ఈ క్రమంలో మదనపల్లె మండలం వలసపల్లె కేంద్రంలో క్యూలైన్ల నిర్వహణ లేకపోవడంతో ఓటర్లు అంతా ఒకేసారి చొచ్చుకురావడంతో తోపులాట జరిగింది. దీంతో పోలింగ్ అధికారులు చేతు లెత్తేయడంతో అరగంటకుపైగా పోలింగ్ ఆగిపోయింది. అనంతరం ప్రత్యేక వాహనంలో పోలీస్ సిబ్బందిని అక్కడికి చేర్చడంతో ఓటర్లను అదుపు చేసి పోలింగ్‌ను తిరిగి ప్రారంభించారు. అలాగే కొన్నిచోట్ల సౌకర్యాలు కల్పించకపోవడంతో అటు పోలింగ్ అధికారులు, ఇటు ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా లైటింగ్ లేని చోట కరెంటు పోవడంతో పార్టీ గుర్తులు కనిపించక వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రాలు, ఓటర్లకు తగినట్లు పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేయలేదు. ఇదిలావుండగా, వృద్ధులు, దివ్యాంగులను వీల్‌చైర్‌లో తీసుకొచ్చి కుటుంబీకులు ఓటు వేయించారు. మధ్యాహ్నం ఎండకు గొడుగు పట్టుకుని వచ్చి కొందరు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## అరాచకవాదుల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



మీడియాతో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, మే 13:అరాచకవాదుల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కు మార్ రెడ్డి పేర్కొన్నారు. నగరిపల్లె పోలింగ్ కేంద్రంలో ఆయన తన సోదరుడు, పీలేరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గం సదుం మండలంలోని బూరగమంద పంచాయతీ పరిధిలోని 188, 189, 190 పోలింగ్ కేంద్రాల్లో తాము నియమించిన పోలింగ్ ఏజెంట్లను వేకువ జామున 4.50 గంటలకు కిడ్నాప్ చేశారని చెప్పారు. అనంతరం వారిని హింసించి, శారీరకంగా గాయపర్చారని అందులో ఒకరికి పళ్ళు కూడా రాలాయని చెప్పారు. ఈ అంశం గురించి ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆ తరువాత వీరిని పీలేరులో విడిచిపెట్టారని వివరిం చారు. ఈ సంఘటన వెనకున్న వారిని అరెస్టు చేయాలని డిమాండు చేశారు. పుల్లంపేట మండలంలో చోటు చేసుకున్న సంఘటనలకు సంబంధించి కూడా రెండు జిల్లాల కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కమిషన్ పనితీరు, అధికారుల నిబద్ధతల గురించి తనకు పూర్తి విశ్వాసముందని స్పష్టం చేశారు. అయితే కొంత మంది నాయకులు ఇందుకు విరుద్ధంగా అనేక అక్రమాలకు పాల్పడుతూ అరాచకలతో ఎన్నికల కమిషన్‌కు సవాళ్ళు విసురుతున్నారని ఆరోపించారు. గతంలో తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలో 34 వేల దొంగ ఎపిక్ కార్డులు సృష్టించి దారుణానికి తెగబడ్డారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోనేందుకు ఓటర్లు విజ్ఞతగా వ్యవహరించాలని కోరారు.